Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 157 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 జూన్ 2023 బుధవారం పేజీలు : 4

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుపతి : తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు 20 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. సర్వ దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. కాగా.. తిరుమల శ్రీవారిని 67,681 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 31,738 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.54 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.



# కమలనాథుల కుమ్ములాటలు

# కేసీఆర్‌కు కలిసొస్తున్నాయే!

హైదరాబాద్ : కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు తెలంగాణ సీఎం కేసీఆర్ కు బీజేపీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలు బాగా కలిసి వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ దూసుకుపోవాలని ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా రెపరెపలాడించాలని, అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని శతవిధాల చేసిన ప్రయత్నాలన్నీ ప్రస్తుతం బూడిదలో పోసిన పన్నీరుగా మారినట్టుగా కనిపిస్తున్నాయి. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా తయారయ్యాయి. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ బీజేపీ లో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఏకతాటి మీద తెలంగాణ సీఎం కేసీఆర్ పై, బిఆర్ఎస్ పై సమరం చేయాల్సిన బిజెపి నేతలు దానిని పక్కన పెట్టి ఆధిపత్యపోరులో అంతర్భాగమయ్యారు. దీంతో బిజెపి అనుకున్న లక్ష్యానికి దగ్గరగా కాకుండా దూరంగా జరుగుతోంది. సీనియర్ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లకు బిజెపిలో అదనపు బాధ్యతలు అప్పగించాలని బండి సంజయ్ ను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బాధ్యత నుండి తప్పించాలని పార్టీలోని పలువురు సీనియర్ నాయకులు కోరుకోవడం బిజెపి అధిష్టానానికి ఇబ్బందిగా మారింది. వ్యూహాత్మకంగా ఎన్నికలకు పని చేయాల్సిన చోట బీజేపీ నేతలు అది పక్కన పెట్టి పదవులకోసం కొట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో బీజేపీ విజయం సాధిస్తే సీఎం తామేనని చెప్పుకునే ప్రయత్నం చేయడం వంటి అంశాలతో బీజేపీలోని క్యాడర్ నైతిక స్థైర్యం దెబ్బతింది. అధిష్టానం కీలక నాయకులను పిలిచి చర్చలు జరిపి, హెచ్చరికలు చేస్తున్నా రాష్ట్ర బీజేపీ నాయకుల్లో మార్పు లేదు. ఇక తెలంగాణ రాష్ట్రంలో తాజాగా కాంగ్రెస్ పార్టీలోకి 33 మంది నాయకులు చేరడంతో బీజేపీకి అది గట్టి షాక్ ఇచ్చినట్టు అయింది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు వంటి కీలక నాయకులు కూడా పార్టీలోకి తీసుకు రాలేకపోయిన తెలంగాణ బీజేపీ నాయకుల అసమర్థతపై బిజెపి అధినాయకత్వం గుర్రుగా ఉంది. ఇక తెలంగాణలో బీజేపీ పుంజుకుంటుందని భయపడిన సీఎం కేసీఆర్, ప్రస్తుతం బీజేపీ విషయంలో బిందాస్ గా ఉన్నారు. అంతర్గత గొడవలతో బిజెపి నాయకులు వచ్చే ఎన్నికల పై ఫోకస్ చేయలేరని ధీమాతో ఉన్నారు. గోల్డ్ స్మగ్లింగ్ నిందితురాలు స్వప్నాకు షాక్ ఇచ్చిన హైకోర్టు, ఇలాంటి కేసుల్లో ! అందుకే ఇటీవల కాలంలో ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ ని టార్గెట్ చేస్తూ తెలంగాణ మంత్రులు వ్యాఖ్యలు చేస్తున్నారు తప్ప బిజెపి వారిని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే బిజెపిని బీఆర్ఎస్ నేతలు లైట్ తీసుకుంటున్నారు.

అందుకు కారణం బిజెపి ప్రస్తుత పరిస్థితి. ఇక ఈ పరిణామాలు మారకపోతే, అధిష్టానం తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే తెలంగాణ బిజెపి వచ్చే ఎన్నికలకు బలంగా వెళ్లే అవకాశం ఏమాత్రం లేదు. అధిష్టానం అనుకున్నట్టు జెండా ఎగిరే ప్రసక్తే లేదు.

## రెండోరోజు ఖాతాల్లోకి రూ.1278కోట్లు..

## కొనసాగుతున్న రైతు బంధు నిధుల విడుదల..!



వానాకాలం పంటకు సంబంధించి రైతుబంధు పంట సాయం పంపిణీ సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. నిధుల విడుదల మంగళవారం సైతం కొనసాగింది. రెండో రోజు రూ. 1,278 కోట్ల నిధులను 16.98లక్షల మంతి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేసింది. ఇప్పటి వరకు రెండు రోజుల్లో రెండురోజుల్లో 39,54,138 మంది రైతుల ఖాతాల్లో రూ. 1,921 కోట్లు జమయ్యాయి. 38.42లక్షల ఎకరాలకు అంది రైతుబంధు సాయం అందింది. రైతుబంధు ద్వారా తెలంగాణలో సాగు విప్లవం కొనసాగుతుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంటలకు సాగునీరు అందించడంతో పాటు వ్యవసాయానికి ఉచితంగా కరెంటు ఇస్తుందని, రైతుబంధు సహాయం అందిస్తుందన్నారు. ఇదిలా ఉండగా.. వానాకాలం పంటకు సంబంధించి 70లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు సాయం జమ చేయనున్నది. ఈ సారి కొత్తగా 1.5లక్షల మంది పోడు రైతులకు సైతం ప్రభుత్వం రైతుబంధు అమలు చేస్తున్నది. ఈ సారి మొత్తంగా 1.54కోట్ల ఎకరాలకు రూ. 7,720.29కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమవనున్నాయి.

## తెలంగాణలో ఎమ్మెల్యే, ఎంపీల 'క్రైమ్ ఫైల్స్' స్టడీ..

### ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అలర్ట్...

హైదరాబాద్ : తెలంగాణలో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ అలర్ట్ అవుతోంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీలపై ఏమైనా కేసులు నమోదు అయ్యాయా, అయితే ఆ కేసుల తాజా విచారణ, దర్యాప్తు స్థితి ఏమిటి వాటిలో అరెస్టులు, నోటీసుల జారీ, పెండింగ్ వారెంట్‌లు ఏమైనా ఉన్నాయా, ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్నాయా వంటి అంశాల చిట్టాను పోలీసులు సిద్ధం చేస్తునట్లు విశ్వసనీయ సమాచారం.

అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అధికారులు ఎలక్షన్ కమిషన్ నిబంధనల ఉల్లంఘణల కేసుల చిట్టాను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. దీంతో పాటు ఎమ్మెల్యే, ఎంపీలపై నమోదైన కేసుల వివరాల సమస్త సమాచారాన్ని పోలీసులు ప్రత్యేక డాటాలోకి తీసుకువస్తున్నారు. అంతేకాకుండా ఇప్పుడు కొంతమంది ప్రజాప్రతినిధులపై నమోదైన కేసులతో పాటు ఇతర నేరస్థులు, ఎలక్షన్ నేరాలకు పాల్పడిన వారి చిట్టా చిటికేస్తే దొరికేలా పోలీసులు రెడీ చేస్తున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులపై నమోదైన కేసులలో వారిపై జరిగిన దర్యాప్తు, విచారణ వివరాల పత్రాలు, అరెస్టు, పరారీ, బెయిల్ వంటి వివరాలను పోలీసు అధికారులు రెడీగా పెట్టుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ అడిగిన వెంటనే అందించిందేకు సిద్ధం అవుతోన్నట్లు సమాచారం, ఈ ప్రక్రియతో ఎమ్మెలే, ఎంపీల క్రైమ్ ఫైల్స్ ఇంట్రెస్టింగ్‌గా మారనుంది.




ఈ దఫా ఎన్నికైన ప్రజాప్రతినిధుల చాలా మందిపై భూ కబ్జా, ఆర్థిక వ్యవహారాలలో మోసం, బెదిరింపులు, లైగింక వేధింపులు వంటి ఆరోపణలు ఉండటంతో పోలీసులు చర్యలు హాట్ టాపిక్‌గా మారాయి.

# మహారాష్ట్రలో తెలంగాణ తరహా అభివృద్ధి చేసి చూపుతాం

## రత్నగర్భ మహారాష్ట్రకు ఏం తక్కువ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



సోలాపూర్: కేంద్రంలో ఏళ్లుగా అధికారం చెలాయిస్తున్న ప్రభుత్వాల చేతగానితనం వల్ల స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దేశం బాగుపడలేదని బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మంగళవారం సోలాపూర్ జిల్లాలోని సర్కోలీ గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ముందుగా సర్కోలీ సభకు విచ్చేసిన తనకు అపూర్వ స్వాగతం పలికిన భగీరథ్ బాల్కేకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆ తర్వాత ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దేశం బాగుపడలేదని, దేశం బాగు కోసం ప్రస్తుతం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వాల చేతగాని తనాన్ని కేసీఆర్ ఎండగట్టారు. అసలు భారత దేశం లక్ష్యం ఏమిటని, దేశం ఒక లక్ష్యం లేకుండానే ముందుకు పోతోందా..? అని ఆయన ప్రశ్నించారు. దేశంలోని సమస్యలకు పరివర్తన్ భారతే సరైన సమాధానమని అన్నారు. ఆ సమాధానం కోసం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. దేశంలో వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఇన్ని వనరులున్న దేశంలో విద్యుత్ సమస్య ఎందుకు వచ్చిందని..? కేసీఆర్ ప్రశ్నించారు. థర్మల్ విద్యుత్ తయారీకి పుష్కలంగా బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు.

**ప్రభుత్వాల చేతగానితనమే విద్యుత్ సమస్యలకు కారణం :** దేశంలోని చిన్న గ్రామాల నుంచి పెద్ద నగరాల వరకు విద్యుత్ అందించే సామర్థ్యం మనకు ఉందని కేసీఆర్ చెప్పారు. కేంద్ర సర్కార్ల చేతగాని తనమే దేశంలో విద్యుత్ సమస్యలకు కారణమని మండిపడ్డారు. ఇకనైనా భారతదేశం సరికొత్త పంథాలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. మనకంటే చిన్న దేశాలు ఎంతో అభివృద్ధి సాధించాయని చెప్పారు. పొరుగు దేశం చైనా ఎక్కడుంది.. మనమెక్కడ ఉన్నామంటూ పోలిక లేవనెత్తారు. తెలంగాణలో తాము ఎన్నో అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చామని తెలిపారు.

**మాది A టీమ్, B టీమ్ కాదు.. రైతుల టీమ్, ప్రజల టీమ్ :** రత్నగర్భ అయిన మహారాష్ట్రకు ఏం తక్కువైందని కేసీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తరహా అభివృద్ధి మహారాష్ట్రలో ఎందుకు జరగడంలేదని ఆయన ప్రశ్న లేవనెత్తారు. ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, శివసేన, బీజేపీలకు అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. తాము ఏ పార్టీకి A టీమ్, B టీమ్ కాదని, తమది రైతుల టీమ్.. ప్రజల టీమ్ అని కేసీఆర్ నొక్కి చెప్పారు.

**భారత జలవిధానాన్ని బంగాళాఖాతంలో కలుపాలి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సత్తా ఉంటే మహారాష్ట్రలో ప్రతి ఎకారకు సాగునీరు అందించవచ్చన్నారు. ఆ ప్రభుత్వాలు అనుకుంటే పుష్కలంగా తాగునీరు అందించవచ్చని చెప్పారు. ప్రస్తుతం భారతదేశం అనుసరిస్తున్న జల విధానాన్ని బంగాళాఖాతంలో కలుపాలని కేసీఆర్ వ్యాఖ్యానించారు. దేశానికి నూతన జలవిధానం అవసరమని అభిప్రాయపడ్డారు. దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ 4వేలు ఇస్తోందన్నారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ సర్కార్ వస్తే.. అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. వృద్ధులకు పెన్షన్ ఇస్తామన్నారు. అమెరికాలో నల్లజాతి వారిని ఎంతో వేధించారని, కానీ బరాక్ ఒబామాను గెలిపించి అక్కడి ప్రజలు ఆ రుణం తీర్చుకున్నట్లు కేసీఆర్ తెలిపారు. భారత్‌లో కూడా ఇలాంటి మార్పు రావాలని, రైతు ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. తెలంగాణలో ధరణి పోర్టల్‌తో భూముల్ని డిజిటలైజ్ చేసినట్లు సీఎం తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న పథకాల అమలు



.. మహారాష్ట్రలో ఎందుకు జరగవని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్‌లో చేరిన మరాఠీ నేత భగీరథ్ బాల్కేకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు కేసీఆర్ తెలిపారు. పశ్చిమ మహారాష్ట్ర దర్వాజ్ ఓపెన్ చేసిన బాల్కేకు అండగా ఉంటామన్నారు. పండరీపుర వికాసం మొత్తం బాల్కే చేతుల మీదుగా జరుగుతుందన్నారు. రైతు ఇంట్లో పుట్టాను, నేను స్వయంగా రైతును, రైతు సంక్షేమం కోసం పనిచేస్తానని సీఎం కేసీఆర్ తెలిపారు. డిజిటల్ ఇండియా అని కేంద్రం చెబుతోందని, కానీ ఎందుకు భూముల్ని డిజిటైజ్ చేయడం లేదన్నారు. మేక్ ఇన్ ఇండియా అని ప్రధాని చెబుతారని, కానీ ప్రతి వీధిలో చైనా బజార్ ఎందుకు కనిపిస్తున్నట్లు ఆయన ప్రశ్నించారు. దీపావళి బాంబులు, రంగులన్నీ చైనా నుంచే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. భారతదేశ పరివర్తనే అన్నింటికీ పరిష్కారం అన్నారు. ధరణి పోర్టల్లో ఒకసారి రైతు డేటా ఎక్కితే, దాన్ని ఎవరూ మార్చలేరన్నారు. ఒక్క రైతు బయోట్రిక్ ద్వారానే దాన్ని మార్చే వీలు ఉందన్నారు. తెలంగాణ రైతుల వద్ద పాస్‌పోర్టు లాంటి సుందరమైన పాస్ బుక్ ఉంటుందని అన్నారు. తాము ఎవరికీ టీం కాదు అని.. తమది రైతుల టీమ్, దళిత టీమ్ అన్నారు.

రైతులు తోడుంటే ఎవరి అవసరం లేదన్నారు. అబ్ కీ బార్ .. కిసాన్ సర్కార్ అని సీఎం కేసీఆర్ నినాదాలు చేశారు. తమ విధానంలో న్యాయం, నీతి ఉందన్నారు. మరాఠీ నేత భగీరథ్ బాల్కే ఇవాళ సర్కోలీలో జరిగిన సభలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## సంపాదకీయం

# కిరాయి సైన్యం తిరుగుబాటుతో రష్యాలో ఇప్పుడేం జరుగుతోంది?

పాలు పోసి పెంచిన పాముకు బయటవారికి.. యజమానికి తేడా తెలీదు. ఎవరినైనా ఇట్టే కాటేస్తుంటం టారు. అలాంటి ఆటనే ఆడిన రష్యా అధినేత పుతిన్ కు దిమ్మతిరిగే షాక్ తగిలింది. పక్కనున్న ఉక్రెయిన్ ను సొంతం చేసుకోవాలన్న అత్యాశతో భారీ కిరాయి సైన్యాన్ని రంగంలోకి దించి.. తనకున్న ఆయుధ బలంతో ఆ దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి.. తన సొంతం చేసుకోవాలన్న భారీ ప్లాన్ ఇప్పటికే బెడిసికొట్టిన వైనం తెలిసిందే. యుద్ధం ఆరంభించిన నాలుగైదు వారాల్లో ఉక్రెయిన్ ను హస్తగతం చేసుకుంటామని భావిస్తే.. ఏడాదిన్నర కాలంగా ఉక్రెయిన్ మీద పట్టు సాధించేందుకు కిందా మీదా పడుతున్న పరిస్థితి. భరించలేని భారంగా యుద్ధం మారిన వేళ.. ముందుకు వెళ్లలేక.. వెనక్కి రాలేక కిందా మీదా పడుతున్నారు. ఇలాంటి సమయంలోనే ఏడాదిన్నరగా సొంత అస్తిత్వం కోసం పోరాడుతున్న ఉక్రెయిన్.. రష్యాకు కొత్త చిక్కులు తెస్తూ.. ఉక్రెయిన్ విషయంలో తానెంత తప్పు చేశానన్న భావాన్ని పుతిన్ కు కలిగేలా చేస్తోంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. కిరాయి సైన్యం వాగ్నర్ తో ఉక్రెయిన్ ను సొంతం చేసుకోవాలనుకున్న పుతిన్ ప్లాన్ బెడిసి కొట్టటం.. రష్యా మీద తిరుగుబాటు బావుటా ఎగురవేయటంతో షాకింగ్ పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీనికి తోడు రష్యా మిలటరీ నాయకత్వాన్ని కూల్చివేస్తామని వాగ్నర్ చీఫ్ యెవ్ గెనీ ప్రిగోజిన్ వార్నింగ్ ఇవ్వటంతో పాటు.. తమ బలగాలపై రష్యా సైన్యం దాడులకు పాల్పడుతోందని ప్రతీకారం తప్పదని గర్జించాడు. అంతేకాదు..రష్యాలోని ప్రధాన నగరమైన "రోస్తావ్ దాన్" తమ అధీనంలో ఉందని.. ఒక్క బుల్లెట్ పేలకుండానే తాము ఆ నగరాన్ని సొంతం చేసుకున్నట్లుగా ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కు అత్యంత సన్నిహితుడైన వాగ్నర్ చీఫ్.. ఇప్పుడు అడ్డంగా ప్లేట్ ఫిరాయించటం రష్యన్లకు సైతం మింగుడుపడటం లేదు. కిరాయి సైన్యం నుంచి రష్యా తన సొంత ప్రజల్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో మరింత కన్ఫ్యూజన్ కు గురి చేసే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. దీంతో.. ఏది నిజమో.. ఏది అబద్ధమో అర్థం కాని గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. ఇదిలా ఉంటే వాగ్నర్ చీఫ్ ను అరెస్టు చేయాలని రష్యా ప్రభుత్వం ఆదేశాలుజారీ చేసింది. దీంతో.. ఇరవై ఏళ్లుగా తనకు తిరుగులేని అధికారబలంతో దూసుకెళ్తున్న పుతిన్ తొలిసారి పదవీ గండం ముప్పును ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఈ సందర్భంలో పుతిన్ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. కిరాయి సైన్యం చీఫ్ పేరును ప్రస్తావించకుండా.. వెన్నుపోటు పొడిచినట్లుగా వ్యాఖ్యానించారు. తిరుగుబాటు చేసిన వారికి కఠిన శిక్షలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. తిరుగుబాటు చేసిన వారిని ఏం చేయాలో తామిప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లుగా పుతిన్ చెప్పినప్పటికీ.. అదంత తేలికైన విషయం కాదంటున్నారు. వాగ్నర్ చీఫ్ పై క్రిమినల్ కేసును నమోదు చేశారు. ఇదిలా ఉంటే పుతిన్ స్పీచ్ తర్వాత.. వాగ్నర్ చీఫ్ ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. తమను దేశ ద్రోహులుగా పేర్కొంటూ పుతిన్ పెద్ద తప్పు చేశారన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో పోరాడిన అసలుసిసలు దేశ భక్తులం తామేనని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి లొంగేది లేదన్న ఆయన.. తన సైన్యంతో మాస్కోను ముట్టడిస్తామని పేర్కొన్నారు. రష్యా కీలకమైన రోస్తావ్ దాన్ నగరాన్ని తాము స్వాధీనం చేసుకున్నామని.. సైనిక ప్రధాన కార్యాలయం.. ఇతర సైనిక స్థావరాల్ని తమ అధీనంలో ఉన్నట్లుగా వాగ్నర్ చీఫ్ వెల్లడించారు. అంతేకాదు.. రష్యా రక్షణ మంత్రి.. మిలటరీ జనరల్ ఇద్దరూ రోస్తోవ్ లోని మిలటరీ కార్యాలయంలో తనతో సమావేశం కావాలన్నారు. తన డిమాండ్ ను నెరవేర్చకపోతే.. రాజధాని మాస్కోను ముట్టడిస్తామన్న ఆయన మాటకు తగ్గట్లే.. పాతిక వేల సైనిక బలం ఆ దిశగా బయలుదేరింది. మాస్కోకు 360కి.మీ. దూరంలో ఉన్న వాగ్నర్ బలగాలకు చెందిన వీడియోలు బయటకువచ్చాయి. తాజా పరిణామాల నేపథ్యంలో మాస్కోలో బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు గుమిగూడి ఉండే కార్యక్రమాల్ని రద్దు చేస్తున్నట్లుగా మాస్కో గవర్నర్ ఆదేశాలుజారీ చేయటంతో పాటు జులై ఒకటి వరకు స్కూళ్లకు సెలవులు ఇచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో బెలారస్ అధ్యక్షుడు రంగంలోకి దిగారు. ఆయన మధ్యవర్తిత్వంతో రష్యా- కిరాయి సైన్యం చీఫ్ కు మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినట్లుగా చెబుతున్నారు. మాస్కో లక్ష్యంగా సాగుతున్న 25వేల ప్రైవేటు సైన్యాన్ని ప్రస్తుతానికి వెనక్కి వెళ్లాలని.. రష్యన్ల రక్తం చిందకూడదన్న ఉద్దేశంతోనే తామీ నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. తమ సైన్యాలనుఉక్రెయిన్ లోని స్థావరాలకు వెళ్లాల్సిందిగా సూచన చేసినట్లుగా పేర్కొన్నారు. ఇలాంటి వేళ.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ సీన్లోకి వచ్చారు. చెడు మార్గంలో పయనించేవారు తమ నాశనాన్ని తామే తెచ్చుకుంటారన్నారు. రష్యా ఇప్పుడు పూర్తిగా బలహీనమైనదని పేర్కొన్నారు. కిరాయి సైన్యాన్ని రష్యా.. తమ దేశంలో ఎంత ఎక్కువ కాలం ఉంచుకుంటుందో.. అంత ఎక్కువ బాధను పుతిన్ అనుభవిస్తారని వ్యాఖ్యానించటం గమనార్హం.

# చదువే ఆయుధం.. పేదరికంపై విజయం!



ఉట్నూరు : ఒకరేమో రైతు బిడ్డ, మరొకరు గీత కార్మికుడి కూతురు, ఇంకొకరూ ఆటో డ్రైవర్ బిడ ముగ్గురువీ నిరుపేద కుటుంబాలే! తల్లిదండ్రుల చదువులు అంతంత మాత్రమే. బతుకుదెరువు కోసం వారు పడరాని పాట్లు పడేవారు. తమ కళ్లముందే ఇతరుల పిల్లలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లి చదువుకుంటుంటే.. వేమూ వారిలాగా తమ పిల్లలను చదివించలేకపోతున్నామని ఆవేదన చెందేవారు. పేదరికం కారణంగా ఉన్న ఊళ్లలోని సర్కారు బడుల్లోనే చదివించారు. కన్నవారి కష్టాలను కళ్లారా చూసిన ఆ ఆడబిడ్డలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి మార్చేందుకు చదువునే ఆయుధంగా మల్చుకున్నారు. వారి పట్టుదల ముందు పేదరికం తలవంచింది.. కష్టం ఫలించి పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రభుత్వ కొలువుల సాధనలో విజయం సాధించారు. వృత్తి ధర్మాన్ని అంకితభావంతో నిర్వహిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్న ఈ మహిళా ఉద్యోగుల విజయ ప్రస్థానంపై స్ఫూర్తిదాయక కథనం.

**అమ్మానాన్నల కష్టమే నన్ను కదిలించింది..**
**– ఎంపీడీవో తిరుమల**

మా సొంతూరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం. అమ్మానాన్న పోచయ్య, లక్ష్మి. మేము మొత్తం అయిదుగురం. పేద కుటుంబం కావడంతో కుటుంబాన్ని పోషించేందుకు తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు పడ్డారు. నేను ఒకటి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివాను. అమ్మానాన్న పడిన కష్టం నన్ను కదిలించింది. బాగా చదివి మంచి ఉద్యోగం సాధించి వారికి ఆసరాగా నిలవాలనే కసితో శ్రమించాను. డిగ్రీ తరువాత బీఎడ్ చేశాను. పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా.. 2010లో తొలిసారి డీఎస్సీ పరీక్ష రాసి టీచర్ ఉద్యోగం కైవసం చేసుకున్నాను. ఉద్యోగం చేస్తుండగానే నాకు పెళ్లైంది. మా ఆయన శ్రీనివాసు నా ప్రతిభను చూసి వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఈ క్రమంలో 2018లో గ్రూప్–1 పరీక్ష రాసి మొదటి ప్రయత్నంలోనే మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) పోస్టును సాధించాను. తొలి పోస్టింగ్ ఉట్నూరు ఎంపీడీవోగా నియమించడంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్నా. ఉద్యోగం చేస్తూనే మళ్లీ ఉన్నత ఉద్యోగాలకు ప్రిపరేషన్ కొనసాగిస్తున్నాను. 2019లో టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి డిప్యూటీ తహసీల్దార్ పోస్టుకు ఎంపికయ్యాను. కానీ నా ప్రస్తుత సీనియారిటీ పోతుందని ఆ ఉద్యోగంలో చేరలేదు. కష్టపడి ఒకటి, రెండు కాదు మూడు ఉద్యోగాలు సాధించాను. పేదరిక కుటుంబమని, అవకాశం రాదని యువత బాధపడకుండా లక్ష్య సాధన కోసం పాటుపడితే తప్పకుండా విజయం సాధిస్తారని ఎంపీడీవో తిరుమల పేర్కొన్నారు.

**స్నేహితుల పుస్తకాలతో చదువుకున్నా!**
**– మంజులత, సూపర్‌వైజర్**

మాది కరీంనగర్ జిల్లా చింతకుంట గ్రామంలోని రాజీవ్‌నగర్. అమ్మానాన్న దానమేని బాలరాజు, భూలక్ష్మి. నాకో తమ్ముడు కిరణ్ ఉన్నాడు. నాన్న ఆటో నడిపేవాడు. అమ్మ కూలీ పనికి వెళ్లేది. మేం చదువుకోలేదు కనీసం మా పిల్లలనైనా చదివించాలనేది వారి కోరిక. పదో తరగతిలో మంచి మార్కులతో పాస్ అయ్యాను. ఇంటర్ కోసం ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష రాసి రాష్ట్రస్థాయిలో 61వ ర్యాంకు సాధించడంతో ఆంధ్ర ప్రాంతంలోని బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో సీటు వచ్చింది. కానీ వెళ్లలేదు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం ఉచితంగా చదివిస్తామని ముందుకు రావడంతో ఇంటర్ పూర్తిచేశా. డిగ్రీ చేసే సమయంలో పుస్తకాలు కొనుక్కుందామంటే డబ్బులు లేక తోటి స్నేహితుల వద్ద అడిగి తీసుకెళ్లి చదివేదాన్ని. కుటుంబ పరిస్థితులు నాకు బాధించాయి. ఓ ప్రైవేటు ఉద్యోగంలో చేరాను. స్వయం కృషితో ఎదగాలనే తపనతో చదువును ఆపలేదు. తొలిసారి 2011లో గ్రూప్–2 పరీక్షలు రాసినా కొద్దిలో మిస్ అయింది. ఆ తరువాత ఓయూలో ఎంఎస్‌డబ్ల్యూ చేశాను. తరువాత యూజీసీ నెట్ రాసి పాస్ కావడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ పీహెచ్‌డీకి అర్హత సాధించి పీహెచ్‌డీ చేశాను. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తుండగా 2019లో టీఎస్‌పీఎస్సీ సూపర్‌వైజర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కసిగా చదివి ఉద్యోగాన్ని సాధించా. తొలి పోస్టింగ్ ఇంద్రవెల్లి మండలంలో ఇచ్చారు. ప్రస్తుతం ఉట్నూరులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నా. పేదరికం వెంటాడినా.. ప్రోత్సాహం కరవైనా స్వయం కృషితో చదివితే తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని మంజులత పేర్కొంటున్నారు.

# విషజ్వరాల పంజా



ఖమ్మం : మండలం జలగంనగర్‌లో నిర్వహిస్తున్న నేలకొండపల్లి మైనార్టీ బాలుర గురుకులంలో 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. అద్దె భవనంలో ఇది కొనసాగుతోంది. చుట్టపక్కల నుంచి వచ్చే మురుగునీరంతా ఇక్కడే చేరి వరాహాలకు ఆవాసంగా మారింది. పారిశుద్ధ్యం లోపించి ఇటీవల పలువురు విద్యార్థులు విషజ్వరాల బారినపడ్డారు.

ఏన్కూరు గురుకులంలో రోజుల్లో దాదాపు 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఉభయ ఖమ్మం జిల్లాల్లో పలు గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. సీజనల్ వ్యాధుల విజృంభణతో విద్యార్థులు విషజ్వరాల బారిన పడుతున్నారు.

ఈటీవీ, ఖమ్మం: అద్దె భవనాలు, ఆపై కనిపించని మౌలిక వసతులు, పారిశుద్ధ్య లోపం, నాసిరకం ఆహారం, కలుషిత నీరు వెరసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకులాలు, ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు శాపంగా మారుతున్నాయి. చాలాచోట్ల అధిక సంఖ్యలో విద్యార్థులు విషజ్వరాల బారినపడి రోజులకొద్దీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, హాస్టళ్లలో ప్రాథమిక వైద్యానికి అవసరమయ్యే కిట్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు.

ఖమ్మం జిల్లాలో 139 గురుకులాలు, వసతి గృహాల్లో సుమారు 23 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. భద్రాద్రి జిల్లాలో మొత్తం 127 గురుకులాలు, ప్రభుత్వ వసతిగృహాల్లో సుమారు 40 వేల మంది చదువుతున్నారు. భారీ వర్షాలు, వరదల తర్వాత సీజనల్ వ్యాధులు విజృంభించి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులన్నీ జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. విద్యార్థుల పైనా విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. ప్రధానంగా మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారు. జలుబు, దగ్గు, తలనొప్పితో కొందరు పిల్లలు ఇళ్ల బాటపడుతున్నారు.

సవాలక్ష సమస్యలతో.. ఉభయ జిల్లాల్లోని గురుకులాలకు చాలా వరకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లోనే నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేదు. హాస్టళ్లలోనూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడా కనీసం బ్లీచింగ్ చల్లడం, దోమలవ్యాప్తి లేకుండా చూడటం వంటి పరిస్థితులు కనిపించడం లేదు. వసతిగృహాల్లో శుద్ధిచేసిన నీరు ఇస్తున్న దాఖలాల్లేవు. ఆర్వో ప్లాంట్లు లేనిచోట విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. హాస్టళ్లలో నాసిరకం ఆహార పదార్థాల వినియోగిస్తున్నారు. వారం, 10 రోజులకోసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా వాటి ఊసే లేదు. ఎక్కడా వైద్య కిట్లు అందుబాటులో లేవు. కనీసం జ్వరం, జలుబుకు ఇచ్చే మందులు సైతం అందుబాటులో లేవు.

నేను ఖమ్మం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్ చదువుతున్నాను. కాల్వొడ్డులోని గిరిజన వసతిగృహంలో ఉంటున్నాను. వారం రోజులుగా జ్వరం వస్తుండటంతో ఖమ్మం ఆస్పత్రిలో చేరాను. టైఫాయిడ్ అని చెప్పారు. ఇంకా కొన్నిరోజులు హాస్టల్‌కు వెళ్లే పరిస్థితి లేదు.

నేను అశ్వారావుపేట మైనార్టీ గురుకులంలో ఇంటర్ చదువుతూ వసతిగృహంలో ఉంటున్నాను. 10 రోజుల నుంచి జ్వరం వస్తుంది. తగ్గకపోవడంతో ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. వైద్య పరీక్షలు చేసి టైఫాయిడ్ అని చెప్పారు. జ్వరం తగ్గిన తర్వాతే హాస్టల్‌కు వెళ్తాను.

నిస్సార్, విద్యార్థిని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

**అధికారులను అప్రమత్తం చేశాం..**
**ఎన్.మధుసూదన్, అదనపు కలెక్టర్**

ప్రస్తుతం సీజనల్ వ్యాధుల దృష్ట్యా వసతి గృహాల్లో అధికారులను అప్రమత్తం చేశాం. విద్యార్థులు విషజ్వరాల బారినపడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. నాణ్యమైన ఆహారం ఇవ్వాలని, వైద్య బృందాలు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించాం.

# భారజల ప్లాంటును సందర్శించిన ఛైర్మన్

అశ్వాపురం : భారజల బోర్డు ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ జితేంద్ర శ్రీవాత్సవ భారజల ప్లాంటును, ప్లాంటులోని వివిధ విభాగాలను సందర్శించారు. ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సాయంత్రం గౌతమీనగర్‌లోని భారజల ప్లాంటు పర్ణశాల అతిథిగృహాన్ని చేరుకున్నారు. గురువారం ఉదయం ఆయన ఇక్కడి నుంచి భద్రాచలం వెళ్లి సీతారామచంద్ర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం అక్కడి నుంచే హైదరాబాద్‌కు, తరవాత విమానంలో ముంబయికి వెళ్తారు. భారజల బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వీవీఎస్‌ఏ ప్రసాద్, భారజల ప్లాంటు జీఎం కేవీ థాలే, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పుస్తకాలు గప్‌చిప్..!!

వరంగల్ : శాస్త్ర, సాంకేతిక నిపుణులు రచించిన లక్షలాది పుస్తకాలకు మరింత భద్రత కల్పించేలా వరంగల్ జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (నిట్)లోని గ్రంథాలయంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారు. ఇందుకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) టెక్నాలజీని అమలు చేశారు. ఎస్ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా ఇటీవల జరిగిన జాతీయ గ్రంథాలయ దినోత్సవం రోజున ఈ సాంకేతికతతో పూర్తి స్థాయిలో అనుసంధానం చేసిన లైబ్రరీని డైరెక్టర్ ఆచార్య రమణారావు ప్రారంభించారు. దేశంలో తొలిసారిగా కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ప్రారంభించిన సాంకేతికతతో ప్రతి పుస్తకానికి చిప్ అమర్చడం వంటి భద్రతతో పాటు ఉపయోగకరమైన అంశాలున్నాయి.

**కనిపించకుండా చిప్..**

పలు దేశాల్లో పుస్తకాలకు అమర్చుతున్న క్యూఆర్ కోడ్, ఎలక్ట్రానిక్ చిప్స్, మ్యాగ్నటిక్స్ విధానంలా గ్రంథాలయంలోని పుస్తకంలో ఎవరికీ కనిపించకుండా ఆర్ఎఫ్ఐడీ చిప్‌తో పాటు ఎలక్ట్రానిక్ మ్యాగ్నటిక్ స్ట్రిప్ (ఈఎంఎస్) అమరుస్తారు. చిప్ ఏటీఎం కార్డు మాదిరిగా ఉంటుంది. ఎవరైనా చిప్ చించేస్తే మరో మ్యాగ్నటిక్ స్ట్రిప్ గుర్తిస్తుంది. ఈఎంఎస్ స్ట్రిప్‌ను గుర్తించడం ఎవరి వల్ల సాధ్యం కాదు.

**అలారంతో అప్రమత్తం..**

అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందికి లైబ్రరీలో సభ్యత్వం ఉంటుంది. సభ్యులను కేటగిరీలుగా విభజించి టెక్నాలజీ చిప్‌తో రూపొందించిన గుర్తింపు కార్డులు జారీ చేశారు. అధ్యాపకులకు ఎరుపు రంగు, విద్యార్థులకు ఆకుపచ్చ, బోధనేతర సిబ్బందికి నీలి రంగు, మాస్టర్స్ విద్యార్థులకు గులాబీ రంగు చిహ్నంతో కార్డులు జారీ చేశారు. లైబ్రరీ ప్రవేశ మార్గంలో 'మెటల్ సెక్యూరిటీ గేట్' ఏర్పాటు చేశారు. ఎవరైనా సభ్యులు అనధికారికంగా పుస్తకం బయటకు తీసుకెళ్తే వెంటనే అలారంతో సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది.

**యంత్రంలో నమోదు చేస్తే..**

గ్రంథాలయంలో పుస్తకాలు తీసుకోవాలంటే సభ్యుల వివరాలు నమోదు చేసుకుని జారీ చేసేవారు. ఇక నుంచి మరింత సులభతరంగా పుస్తకాలు తీసుకెళ్లవచ్చు ఏటీఎం మాదిరి యంత్రాలు ఏర్పాటు చేశారు. అవసరమైన పుస్తకం తీసుకెళ్లేవారు యంత్రం వద్ద ఐడీ కార్డు ద్వారా స్వయంగా నమోదు చేసి తీసుకెళ్లవచ్చు ఎనీ టైమ్ బుక్ సిస్టం పేరుతో ఏర్పాటు చేసిన ఈ యంత్రంలో ఇష్యూ, రెన్యూవల్, రిటన్, అకౌంట్స్ ఆప్షన్లు కనిపిస్తాయి. పుస్తకం తిరిగి ఇవ్వాలనుకునే వారు 'రిటన్ ఆప్షన్' ఎంచుకోవాలి. కొత్తగా తీసుకునే వారు ఇష్యూ ఆప్షన్, గడువు పొడగింపునకు రెన్యువల్, ఖాతా వివరాలకు అకౌంట్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. యంత్రం వద్ద పుస్తకం సమర్పించిన తర్వాత నమోదు చేయకుండా అదే పుస్తకం బయటకు తీసుకెళ్తే ప్రవేశమార్గంలో అల్లారం మోగుతూ ఎరుపు రంగు బుగ్గ హెచ్చరిక జారీ చేస్తుంది.

సెలవుల్లోనూ.. సెలవు రోజుల్లోనూ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేందుకు డ్రాప్ బాక్స్ విధానం ప్రవేశపెట్టారు. లైబ్రరీ బయట ప్రవేశ మార్గంలో డ్రాప్ బాక్స్ పేరుతో యంత్రం ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు ఎప్పుడైనా సరే పుస్తకాలు తిరిగి ఇచ్చేసే అవకాశం ఉంటుంది. డ్రాప్ బాక్సు వద్ద కంప్యూటర్‌పైన పుస్తకం ఉంచితే వివరాలు కనిపిస్తాయి. 'సబ్‌మిట్ బుక్ ఆప్షన్' ఎంపిక చేస్తే పుస్తకం లోపలికి వెళ్లి రశీదు బయటకు వస్తుంది. వెంటనే సభ్యుల ఖాతా నుంచి పుస్తకం తిరిగి సమర్పించినట్లు నమోదవుతుంది. త్వరలోనే లైబ్రరీ లోపలికి వెళ్లడానికి రాత్రి సమయం పొడిగించి మానవరహిత సేవలు అందించేలా సన్నాహాలు చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో.. ఆర్ఈసీగా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు సేకరించిన పుస్తకాలు, జర్నల్స్ ఇక్కడ రికార్డు స్థాయిలో ఉన్నాయి. దేశంలో ఎక్కడా లేనంత పుస్తక సంపద నిట్ లైబ్రరీ సొంతం. 1923లో ముద్రించిన 'ఎర్తింగ్ ప్రిన్సిపల్స్ అండ్ ప్రాక్టీస్' అనే పుస్తకం నుంచి 2023 విద్యాసంవత్సరానికి గాను ప్రచురించిన కొత్త గ్రంథాలు సుమారు 1,85,000 వరకు ఉన్నాయి. గతంలో ఏటా ఆడిట్ నిర్వహించినప్పుడు లెక్క తేల్చడానికి ఏడు నెలల సమయం పట్టేది. ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీతో వారం రోజుల్లోనే పూర్తి చేయవచ్చు అల్మారాలో పుస్తకాలు తారు మారైనప్పుడు స్కానర్ సాయంతో ఎక్కడున్నా గురించవచ్చు కంప్యూటర్‌లో పుస్తకం కోడ్ ఎంటర్ చేసి స్కానర్ చూపిస్తూ పోతే మాయమైన పుస్తకం ఉన్న చోటు పసిగట్టి అల్లారం వినిపిస్తుంది.

**నాలులు నెలలు శ్రమించి.. – డాక్టర్ కె.వీరాంజనేయులు, గ్రంథపాలకుడు.**

లైబ్రరీలోని అన్ని పుస్తకాలకు ఆర్ఎఫ్ఐడీ అనుసంధానం చేయడానికి నాలుగు బృందాలు కలిసి సుమారు నాలుగు మాసాలు శ్రమించాం. అరుదైన గ్రంథాలు, నిపుణుల రచనలకు జాగ్రత్తగా చిప్‌లు అమర్చాం. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు, సభ్యులకు మరింత సులభతరంగా పుస్తకాలు ఇచ్చి, పుచ్చుకునే అవకాశం కలిగింది.

**భావితరాలకు అందించేందుకే.. – ఆచార్య ఎన్‌వీ.రమణారావు, నిట్ సంచాలకుడు**

దేశంలో ఏ విద్యాసంస్థలో లేనన్ని పుస్తకాలు నిట్‌లో ఉన్నాయి. అరుదైన పురాతన గ్రంథాలతో పాటు, శాస్త్ర, సాంకేతిక నిపుణుల రచనలు, విద్యార్థులకు, అధ్యాపకులకు ఉపయోగకరమైన సంపద లైబ్రరీలో ఉంది. అన్నింటినీ భావితరాలకు అందించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలులోకి తెచ్చాం. పుస్తక పాఠకులకు సమయం ఆదా కావడంతో పాటు, పారదర్శకంగా సేవలు అందుతాయి. ఇక నుంచి ఎట్టి పరిస్థితిలోనూ పుస్తకాలు మాయం కావడం, తారుమారు కావడం లాంటి సమస్యలు తలెత్తవు.

# ఓసిటీ స్టేడియంలో ఉద్రిక్తత

వరంగల్ : కాశీబుగ్గ ఓసిటిలోని వరంగల్ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ మైదానంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. స్టేడియంలో పోచమ్మ తల్లి విగ్రహాలను గుర్తించారు. ఇది తెలిసి కాశీబుగ్గ, ఓసిటీ, భగత్‌సింగ్‌నగర్, లేబర్‌కాలనీ, సొసైటీకాలనీ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్టేడియానికి చేరుకుని పూజలు చేయడం ఆరంభించారు. కొందరు బోనాలతో తరలివచ్చారు. మరికొందరు చీరలు సమర్పించుకున్నారు. చుట్టు పక్కల ఉన్న కాలనీ వాసులు పూజలు చేసిన అనంతరం అమ్మవారి ప్రతిమల వద్ద కోళ్లను, గొర్రెలను బలిచ్చారు. మహిళల పూనకాలతో స్టేడియం దద్దరిల్లింది. విషయం తెలుసుకున్న జిల్లా క్రీడల అధికారి సొటాల ఇందిర స్టేడియానికి చేరుకున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన ఆమెపై కొందరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించగా అక్కడే ఉన్న కోచ్‌లు అడ్డుపడ్డారు. ఇదే విషయాన్ని క్రీడల అధికారి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన అదనపు కలెక్టర్ హరిసింగ్‌ను పంపించారు. అప్పటికి పలువురు ఆందోళనకు దిగడంతో ఏసీపీ గిరికుమార్, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐలు, క్రీడా శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్రీడా ప్రాంగణంలో పూజలు చేయవద్దని కోరారు. సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో అమ్మవారి భక్తులకు అధికారులకు మధ్య స్వల్పవాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు పూజలు ఆపలేదు.

# కస్తూర్బాల్లో కొలువుల జాతర

కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కొలువుల జాతర మొదలు కానుంది. ఏటా బోధకుల కొరతతో కుస్తీలు పడాల్సిన పరిస్థితులుండేవి. నాలుగేళ్లుగా పోస్టులు భర్తీ చేయలేదు. తాత్కాలిక పద్ధతిలో తీసుకున్న బోధకులతో విద్యా సంవత్సరాల్ని ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. తాజా నోటిఫికేషన్‌తో బాలికా విద్యాలయాల్లో పరిస్థితి చాలా వరకు మెరుగుపడనుంది.

ఐదేళ్లుగా నిరీక్షణ

కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయడంతో చివరిసారిగా 2018 సంవత్సరంలో పీజీ-సీఆర్టీలను నియమించారు. ఆ తర్వాత పలు ఖాళీలున్నా భర్తీ జరగలేదు. ఇన్నాళ్లూ అరకొర ఉపాధ్యాయులు, అధ్యాపకులతోనే బోధన సాగేది. తాజాగా ఈ సమస్య పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం వెల్లడించింది. ఈ మేరకు స్పెషల్ ఆఫీసర్ల(ఎస్‌ఓ)తో పాటు ఆరు నుంచి పదో తరగతి వరకు బోధన కోసం సీఆర్టీలు,



పీజీ-సీఆర్టీలు (ఇంటర్మీడియట్), పీఈటీల భర్తీకి నోటిఫికేషన్ జారీఅయింది. ఈ నెల 26 నుంచి జులై 5వ తేదీ వరకు %www.schooledu.telangana.gov.in% వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. అభ్యర్థినులు బహుళైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది.కేజీబీవీలను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వమే ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తుంది. పోస్టుల భర్తీతో విద్యార్థినుల్లో అభ్యసనా సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయి.

# పరిశ్రమలొస్తేనే ప్రగతి!

మహబూబాబాద్ : జిల్లా మరింత అభివృద్ధి చెందాలన్నా.. యువతకు స్థానికంగానే ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి దొరకాలన్నా పరిశ్రమలు అవసరం. పరిశ్రమల స్థాపనకు జిల్లాలో అపార అవకాశాలున్నాయి. కావాల్సిన స్థలం, ముడిసరకుల లభ్యతకు కొదవ లేదు. కానీ ఆ దిశగా పాలకులు, అధికారులు దృష్టిసారించడం లేదు. అత్యధిక నిక్షేపాలున్న గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమల ఏర్పాటు విషయంలో వెనుకడుగు వేస్తున్నారు. దాంతో వేలాది క్యూబిక్ మీటర్ల ముడిసరకు పక్క జిల్లాతో పాటు ఇతర దేశాలకు కూడా తరలుతోంది. ఫలితంగా జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కోల్పోవడంతో పాటు స్థానికంగా ఉపాధి దొరక్క నిరుద్యోగులు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారు.

నిక్షేపాలు ఇలా..జిల్లాలో 168 బ్లాక్ గ్రానైట్, 2 కలర్ గ్రానైట్ క్వారీలున్నాయి. ఇందులో 53 క్వారీల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. కేసముద్రం, తొర్రూరు, ఇనుగుర్తి, గూడూరు, నెల్లికుదురు మండలాల్లో ఈ క్వారీలున్నాయి. వీటి నుంచి రాయిని ఖమ్మంలోని పాలిషింగ్ పరిశ్రమలకు తరలిస్తున్నారు. అలాగే పక్క దేశమైన చైనాకు కూడా వెళ్తోంది. పాలిషింగ్ పరిశ్రమల్లోని డిమాండ్‌ను బట్టి ప్రతి నెల ఆన్‌లైన్ విధానంలో సుమారు 2 వేలు, ఆఫ్‌లైన్ విధానంలో 1500 క్యూబిక్ మీటర్లు మొత్తంగా 3500 క్యూబిక్ మీటర్ల రాయి ఖమ్మం, చైనా, ఇతర ప్రాంతాలకు తరలుతున్నట్లు మైనింగ్‌శాఖలోని ఓ అధికారి తెలిపారు. ఇంత మొత్తంలో ఖనిజం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నపుడు ఈ ప్రాంతలోనే వాటికి సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే ఆలోచన పాలకులు, అధికారులు ఎందుకు చేయడం లేదని నిరుద్యోగులు



విచారం వ్యక్తం చేస్తున్నారు.

దక్కని ఆదాయం

ఇక్కడి వేలాది క్యూబిక్ మీటర్ల గ్రానైట్ రాయి ఖమ్మం జిల్లాలోని పాలిషింగ్ కేంద్రాలకు తరలుతోంది. దాని వల్ల స్లాబ్ విధానంలో జిల్లాకు రావాల్సిన సీనరేజ్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) ఫీజులు పూర్తి స్థాయిలో దక్కడం లేదు. అవి ఖమ్మం జిల్లా మైనింగ్‌శాఖ విభాగానికే చెందుతున్నాయి. జిల్లా ఏటా కోట్ల రూపాయాల ఆదాయాన్ని కోల్పోతుంది. ఫలితంగా స్థానిక సంస్థల్లో, ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులు అందకుండా పోతున్నాయి.

ప్రత్యక్ష.. పరోక్ష ఉపాధికి దూరం

యువకులు స్థానికంగా అవకాశాలు లేకపోవడంతో హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాలకు వలస బాట పడుతున్నారు. అక్కడికి వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ తిరిగి సొంతూళ్లకు వచ్చిన వారున్నారు. స్థానికంగా కూలీ పనులకు వెళ్తూ కాలం వెళ్లదీస్తున్న వారున్నారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని పాలకులు, అధికారులు అవసరమైన పరిశ్రమల స్థాపనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. దాంతో వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

ఇండస్ట్రియల్ పార్కు నెలకొల్పాలి

పులి రమేశ్, నెల్లికుదురుజిల్లాలో ఉన్న వనరులకు తగినట్లుగా పరిశ్రమలు లేవు. ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసి అందులో స్థానికంగా లభిస్తున్న వనరులను దృష్టిలో పెట్టుకొని వాటికి సంబంధించిన పరిశ్రమలను నెలకొల్పాలి. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి.

పాలిషింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలనుకుంటున్నాం

సత్యనారాయణ, జనరల్ మేనేజర్, పరిశ్రమలశాఖ

జిల్లాలో గ్రానైట్ రాయి లభ్యతను దృష్టిలో పెట్టుకొని అందుకు అవసరమైన పాలిషింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. 10 యూనిట్లను అందుబాటులోకి తీసుకొస్తే వందలాది మంది నిరుద్యోగులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కలగడంతో పాటు జిల్లాకు ఆదాయం వస్తుంది. ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం.

# రాయితీల ఎర.. ప్రజాధనం గుల్ల



ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న గొర్రెల పంపిణీ పథకం రెండో విడత ప్రక్రియ ఇటీవల మొదలైంది. గొల్ల కురుమల జీవనోపాధికి ప్రవేశపెట్టిన ఈపథకంపై దళారుల కన్ను పడింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పలువురు దళారులు సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి ఆఫర్లు ప్రకటిస్తున్నారు. కరపత్రాలు, వాట్సప్‌ల ద్వారా లబ్ధిదారులను ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు. గొల్లకురుమలకు తీపికబురు పేరిట రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటాయి. ఒక్కో యూనిట్ విలువ రూ.1.75 లక్షలు. లబ్ధిదారు తన వాటా కింద రూ.43,750 చెల్లించాలి. మిగతా 1,31,250 ను ప్రభుత్వం భరిస్తుంది. లబ్ధిదారులు తమకు కావాల్సిన గొర్రెల కోసం అధికారులను ఆశ్రయిస్తారు. ఈ క్రమంలో దళారులు చొరబడుతున్నారు. లబ్ధిదారు వాటాలో ఒక్కో యూనిట్‌కు రూ.20వేలు ఆఫర్ ప్రకటిస్తున్నారు. క్యాష్ బ్యాక్ ద్వారా రూ.15వేలు చెల్లిస్తామని, భోజనం, వసతి, రవాణా సౌకర్యం పేరిట రూ.5వేలు ఖర్చు చేస్తామని చెబుతున్నారు. కొందరు లబ్ధిదారులు వీరితో జత కడుతున్నారు.

దొందూదొందే..

ఒక్కో యూనిట్‌కు రూ.1,31,250 మేర రాయితీ లబ్ధిదారుకు అందుతుంది. ఇక్కడే లబ్ధిదారులను  దళారులు బుట్టలో వేసుకుంటున్నారు. గొర్రె పిల్లలు, ముదిరిన జీవాలను అంటకడుతున్నారు. కొందరు లబ్ధిదారులు సైతం ఈ పథకాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. తిరిగి అవే జీవాలను దళారులకు సగటున రూ.70వేల నుంచి రూ.80వేలకు విక్రయిస్తున్నారు. వీటినే మరికొందరు లబ్ధిదారులకు దళారులు ముట్టజెబుతున్నారు.లబ్ధిదారులు, దళారులు కుమ్మక్కై రీసైక్లింగ్ ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని, ప్రజాధనాన్ని జేబుల్లో నింపుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అశ్వారావుపేట మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులను కలిసి రీసైక్లింగ్‌కు సహకరించాలని ఇటీవల ఓ వ్యక్తి కోరినట్లు తెలిసింది.

ఉభయ జిల్లాల్లో..ఖమ్మం జిల్లాలో 16,500 మంది లబ్ధిదారులకు 11,500 మంది డీడీలు చెల్లించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇటీవల 72 మందికి గొర్రెలను పంపిణీ చేశారు. భద్రాద్రి జిల్లాలో 3,500 మంది లబ్ధిదారులకు 2,018 మంది డీడీలు చెల్లించారు. ఖమ్మం జిల్లాకు చెందిన లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఎర్ర గొర్రెలను అడుగుతున్నారు. వీరి కోసం కర్ణాటకలోని రాయచూర్, ఏపీలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి జీవాలను కొనాల్సి ఉంది. ఈసారి గొర్రెల పంపిణీలో పశుసంవర్ధకశాఖ పాత్ర పరిమితం. జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో జీవాలను కొంటున్నారు. ఇటీవల దశాబ్ది ఉత్సవాల్లో అధికారులు నిమగ్నమవగా దళారులు గ్రామాల్లో తిరిగి లబ్ధిదారులకు ఆఫర్లు ప్రకటించారనే ఆరోపణలున్నాయి.

రెండో విడతలో అందజేసిన గొర్రెలను రీసైక్లింగ్ చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఆఫర్లు ప్రకటించే దళారులకు సంబంధించిన సమాచారాన్ని పశువైద్యాధికారులకు చేరవేయాలి. లబ్ధిదారులు ప్రలోభాలకు లొంగొద్దు. సెప్టెంబరు వరకు గొర్రెల పంపిణీ ప్రక్రియను పూర్తిచేస్తాం.బి.వేణుమనోహర్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఖమ్మం

# పట్టుదలతో ఏడాదంతా ఆదాయం!



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మల్బరీ తోటల సాగు విస్తీర్ణంపై ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ దృష్టి సారించింది. పట్టుపరిశ్రమ ద్వారా అనేక మందికి ఉపాధి లభిస్తుందని, ఏడాది పొడవునా రైతులకు ఆదాయం సమకూరుతుందని చెబుతోంది. ఇందుకోసం ప్రభుత్వం అందజేసే రాయితీలను వినియోగించుకోవాలని సూచిస్తోంది.

భద్రాద్రి జిల్లాలో..దుమ్ముగూడెం, అశ్వాపురం, పినపాక, అశ్వారావుపేట, దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో ఇప్పటికే 348 ఎకరాల్లో మల్బరీ తోటలున్నాయి. 2023-24లో మరో 230 ఎకరాలకు విస్తరించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు.

వరికి ప్రత్యామ్నాయం..

వరికి ప్రత్యామ్నాయంగా మల్బరీ సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఉభయ జిల్లాల్లో రెండేళ్లుగా మల్బరీ సాగు ఆశాజనకంగా ఉంది. పట్టుగూళ్ల ధరలు కిలో రూ.400కు పైగా నిలకడగా ఉండటంతో గిట్టుబాటు ధర అందుతుందని రైతులు చెబుతున్నారు. రాష్ట్రంలో జనగాం, హైదరాబాద్ మార్కెట్లలో నాణ్యతను బట్టి రూ.600 వరకు ధర పలుకుతోంది.

సానుకూలాంశాలు

అతి తక్కువ నీటి వినియోగం

మల్బరీ మొక్కలు ఒకసారి నాటితే 10- 15 ఏళ్ల వయసు వరకు అవే పనికొస్తాయి. తిరిగి నాటాల్సిన అవసరం లేదు.

నల్లరేగడి, చౌడు భూములు మినహా అన్ని భూములు సాగుకు అనుకూలం.

తొలి ఏడాది మూడు పంటలు, రెండో సంవత్సరం నుంచి ఆరేడు పంటలు తీసుకోవచ్చు.

క్రిమి సంహారక మందుల అవసరం ఉండదు.

సంప్రదాయ పంటలతో నష్టపోకుండా పట్టుపరిశ్రమను చేపట్టి నెలవారీ ఆదాయం పొందవచ్చు. ప్రతి కుటుంబంలో ఐదుగురికి ఉపాధి కల్పించే పంట ఇదే. ఆసక్తి కలిగిన రైతులు మల్బరీ సాగుకు దరఖాస్తు చేసుకోవాలి. సమీపంలోని ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారులను సంప్రదించాలి.అనసూయ, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి, ఖమ్మం

# ఇటు చేరికల జోరు.. అటు టికెట్ల పోరు

ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడం దాదాపు ఖాయమవటంతో ఉభయ జిల్లాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఖమ్మంలో జులై 2న కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకు పొంగులేటి యత్నిస్తున్నారు. పార్టీలో మొదటి నుంచి కష్టపడ్డ తమకే టికెట్లు ఇవ్వాలంటూ పలు నియోజకవర్గాల ఆశావహులు పీసీసీ, ఏఐసీసీ నాయకుల వద్ద మొరపెట్టుకుంటుండటం రాజకీయంగా కాక పుట్టిస్తోంది.

నియోజకవర్గాల వారీగా సమావేశాలు

పొంగులేటితో పాటు ఆయన వర్గీయుల్లో ముఖ్యనేతలు ఈనెల 26న దిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కలవనున్నారు. వచ్చేనెల 2న ఖమ్మంలో భారీ బహిరంగ సభ వేదికగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ సభకు రాహుల్‌గాంధీ హాజరవుతారని సమాచారం. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో పొంగులేటి సొంత భూమిలో సభ ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఉభయ జిల్లాల్లోని పది నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించేందుకు ముఖ్య అనుచరులకు బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం- తుళ్లూరి బ్రహ్మయ్య, వైరా- బొర్రా రాజశేఖర్, విజయాబాయి, పాలేరు- స్వర్ణకుమారి, మధిర- రాంబాబు, సత్తుపల్లి- మువ్వా విజయ్‌బాబు, ఇల్లెందు- కోరం కనకయ్య, పినపాక- పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం- తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట- ఆదినారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు సాగుతున్నాయి.

పార్టీ పెద్దలను కలుస్తున్న నాయకులు

ఇప్పటికే పలు నియోజకవర్గాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను పొంగులేటి ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో పొంగులేటి పార్టీలో చేరితే.. తమ టికెట్లు ఎక్కడ గల్లంతవుతాయోనన్న ఆందోళన కాంగ్రెస్ ఆశావహుల్లో ఉంది. పార్టీ అధిష్ఠానం, ముఖ్యనాయకులను ప్రసన్నం చేసుకునేందుకు హైదరాబాద్, దిల్లీ బాట పడుతున్నారు. ఇటీవల ఇల్లెందు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకుని ఉన్న తమకే టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి రేణుకాచౌదరి ఆధ్వర్యంలో ఖమ్మం, వైరా, సత్తుపల్లికి చెందిన నాయకులు దిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను గురువారం కలిశారు. పార్టీని నమ్ముకుని, కార్యకర్తల్లో ఉన్న తమకే టికెట్ కేటాయించాలని రాములునాయక్ (వైరా), మట్టా దయానంద్ (సత్తుపల్లి) కోరినట్లు తెలిసింది. పొంగులేటి రాకతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంటున్న తరుణంలోనే టికెట్ల పంచాయతీ పార్టీ పెద్దల వరకు చేరుతుండటం గమనార్హం.

# దశాబ్దాల నిర్లక్ష్యానికి సాక్ష్యం

వరంగల్ : ఉమ్మడి వరంగల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర పురావస్తు కట్టడాలు నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలుస్తున్నాయి. ప్రపంచ వారసత్వ గుర్తింపు దక్కిన రామప్ప ఆలయం, వేయిస్తంభాల గుడిలో కల్యాణ మండపం, వరంగల్ కోట ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు వీటిని పూర్తిస్థాయిలో బాగు చేయడంలో విఫలం అవుతున్నాయి.

ముందుకు సాగని పనులు

యునెస్కో గుర్తింపు దక్కి రెండేళ్లు కావస్తున్నా రామప్ప ఆలయం ఆశించినంత మేర అభివృద్ధి జరగడం లేదు. ఆలయాల పునర్నిర్మాణాల పనులు పడకేశాయి. గుర్తింపు ఇచ్చే క్రమంలో యునెస్కో కొన్ని షరతులు విధించింది. ఇప్పటికీ ఆ పనులు పూర్తికాలేదు. కామేశ్వర ఆలయ పునర్నిర్మాణం చేయాలన్నది షరతుల్లో ప్రధానమైనది. 2009లో పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. దాదాపు 14 ఏళ్లు అవుతున్నా కామేశ్వర ఆలయం పునరుద్ధరణకు నోచుకోలేదు. కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టాల్సి ఉంది. పనులు టెండర్ల దశలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నానే ఉన్నారు.៖ రామప్ప పరిసరాల్లో 16 ఉప ఆలయాలున్నాయి. అందులో ఆలయ సమీపంలోని శివాలయం, గొల్లాల గుడిని పునరుద్ధరించాలని నిర్ణయించినా ఆ పనులు సైతం ముందుకు సాగడం లేదు. చెరువు కట్టపై ఉన్న శివాలయం, త్రికూటాలయం పనులు రాష్ట్ర పురావస్తు శాఖ చేపట్టాల్సి ఉంది. ఆ పనులు



ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. ఈశాన్య దిశలోని ప్రహరీ, ఆలయ ఆవరణలో అంతర్గత నడక దారి పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

18 ఏళ్లయినా పూర్తి కాలేదు..

హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ప్రాంగణంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులు 18 ఏళ్లు అవుతున్నా పూర్తి కాలేదు. ఈ ఏడాది డిసెంబరు వరకు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో చూస్తే సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. 2005లో కల్యాణ మండపాన్ని విప్పి మళ్లీ కొత్తగా నిర్మించేందుకు కేంద్ర పురావస్తు శాఖ రూ.6 కోట్లు విడుదల చేసింది. స్థపతి చెల్లింపు లెక్కల్లో తేడా వచ్చి పనుల్లో సంవత్సరాల తరబడి జాప్యం జరగడంతో అంచనా వ్యయం రెట్టింపయ్యింది. గతేడాది కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి కల్యాణ మండపం పనులు ఈ ఏడాది శివరాత్రికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. మొదట్లో శిల్పులు హడావుడి చేసి ఎక్కడి రాళ్లను అక్కడే వదిలేశారు. వచ్చే శివరాత్రికైనా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

కోటను కొల్లగొడుతున్నారు..

వరంగల్ కోట చుట్టూ రియల్ మాఫియా యథేచ్ఛగా ఆక్రమణలు చేస్తున్నా అడిగేవారు లేరు. కేంద్ర పురావస్తు శాఖ అధికారులు నామమాత్రంగా నోటీసులు ఇచ్చి వదిలేయడంతో కోట చుట్టూ ఉన్న మోటును సైతం కబ్జాదారులు స్థలాలుగా చేసి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. ఇక కోటలోని ప్రధాన ఆకర్షణ అయిన కీర్తి తోరణాలకు సమీపంలోనే నిషేధిత ప్రాంతంలో కొందరు అనుమతి లేకున్నా బార్లు కూడా నడిపిస్తున్నారు. కోటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన పురావస్తు ప్రదర్శన శాలను ప్రారంభించడంలో పర్యాటక శాఖ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది.

# మన జిల్లా.. మన ఉత్పత్తి

వరంగల్ : ఉమ్మడి వరంగల్.. మిర్చి పంటకు పెట్టింది పేరు. నర్సంపేట, కేసముద్రం, ఏటూరునాగారం భూములు ఎర్రబంగారం పంటలతో కళకళలాడుతాయి. పసుపు రైతులూ మన వద్ద పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఈ వాణిజ్య పంటలను మార్కెట్కు తీసుకెళ్లి అమ్మితే గిట్టుబాటు అయ్యేది తక్కువే. వీటికి విలువ జోడించి బ్రాండ్‌లా విక్రయించి మంచి లాభాలు తెచ్చేందుకు ఒక కేంద్రం సిద్ధమైంది. ‘వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రాడక్ట్’ కింద కేంద్ర ప్రభుత్వం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి మంజూరు చేసిన కేంద్రం ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. రూ. కోటితో విశాలమైన షెడ్డును నిర్మించారు. మరో రూ.కోటి వెచ్చించి చెన్నై నుంచి యంత్రాలను తీసుకొచ్చారు. బిగింపు ప్రక్రియ మొదలైంది. మరో నెల రోజుల్లో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభం అవుతుందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ రావుల ఉమారెడ్డి తెలిపారు.విలువ జోడింపుపై రైతులకు శిక్షణ

మన దగ్గర పండే మిర్చికి అంతర్జాతీయ మార్కెట్‌లోనూ మంచి గిరాకీ ఉంది. వీటి నుంచి మిర్చి ఫ్లేక్స్ లాంటివి తయారు చేయనున్నారు. ఇప్పటికే వరంగల్ ప్రాంతంలో కొన్ని ప్రయివేటు కంపెనీలవాళ్లు బ్రాండింగ్ చేసి కారం పొడి విక్రయిస్తున్నారు. ఈ కేంద్రంలో బ్రాండింగ్ చేసే నైపుణ్యం గురించి రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ధనియాలు, మిరియాలు, గరం మసాలాల తయారీతోపాటు, మన దగ్గర పండే సుగంధ ద్రవ్యాలకు విలువ జోడించి అమ్మే విధానాల్ని ఇక్కడ నేర్పిస్తారు. ప్రతి నెల ఒకటి రెండు సార్లు రైతులను పిలిచి ఇక్కడ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఏడాది పాటు ఈ కేంద్రాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తలే నిర్వహిస్తారు. అనంతరం శిక్షణ పొందిన రైతుల్లో మేటిగా నిలిచే రైతు ఉత్పత్తి కేంద్రానికి ఈ కేంద్రాన్ని అప్పగిస్తారు..

ఈ కేంద్రంలోనే ఉత్పత్తి చేసిన ఆహార పదార్థాలను పరీక్షించి వాటి నాణ్యతను అంచనా వేయడానికి ప్రయోగశాల కూడా ఏర్పాటు కానుంది. మన ప్రాంతంలో మిర్చి, పసుపు ఇతర సుగంధ ద్రవ్యాలు సాగు చేసే వారికి ఈ కేంద్రం ఏర్పాటయ్యాక ఎన్నో రకాల ప్రయోజనాలు ఉండనున్నాయి.

## నైరుతి పలకరింత.. ఓరుగల్లు పులకరింత!

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు వానాకాలం పంటలసాగుకు దాదాపు నెల కిందటి  నుంచే సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పంటపొలాల్లో దుక్కులు దున్నుకొని విత్తనాలు తెచ్చి పెట్టుకున్నారు. జూన్ మొదటి వారంలోనే విత్తనాలు వేసుకోవాల్సి ఉన్నప్పటికీ మూడో వారం వచ్చినా వానలు కురవకపోవ టంతో ఆందోళనకు గురయ్యారు. అదును దాటుతుందని కలవరపడ్డారు. మరోవైపు ప్రభుత్వం అకాల వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా సాగు సీజన్‌ను నెలరోజులు ముందుకు తెచ్చింది. రైతులకు అవగాహన కల్పించింది. వానలు సకాలంలో కురవకపోవడంతో ముందస్తు పంటలసాగుకు అడ్డంకులు ఎదుర య్యాయి. గత సీజన్‌లకంటే కూడా ఆలస్యంగా విత్తనం వేసే పరిస్థితి ఏర్పడింది.

పెరగనున్న విస్తీర్ణంఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. 2022 వానాకాలం సీజన్‌లో 16.90 లక్షల ఎకరాల్లో  వివిధ రకాల పంటలు వేశారు. ఈసారి అన్ని పంటలసాగు 17.74 లక్షల ఎకరాల్లో సాగవుతుందని ప్రతిపాదించారు. అంటే అదనంగా 84 వేల ఎకరాలు.

# వ్యాధుల కాలం.. పారిశుద్ధ్యలోపం

ఆసిఫాబాద్ : జిల్లాలో రెండురోజులుగా పొడి వాతావరణం ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్య పనుల పట్ల పంచాయతీ సిబ్బంది పట్టనట్లుగా ఉండటం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. జిల్లాకేంద్రంలో మురుగు కాలువల నీళ్లు రహదారులపైనే ప్రవహిస్తూ వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి. వెరసి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల పడకలు రోగులతో నిండిపోతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రతినెలా పంచాయతీలకు వస్తున్నా, పారిశుద్ధ్య పనులకు ఎక్కడా వెచ్చించడం లేదని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే ఇట్టే అర్థమవుతోంది. ఏ గ్రామాన్ని చూసినా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. జిల్లాలో 335 పంచాయతీలు ఉండగా, జనాభాను అనుసరించి జిల్లాకు ప్రతినెలా రూ.7.50 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తున్నాయి. ఇందులో తాగునీరు, పారిశుద్ధ్యానికే అధికంగా వెచ్చించాలి. ఆయా పంచాయతీల పాలకవర్గాలు ఇతర ఖర్చులకు ఈ డబ్బులు కేటాయించడంతో పారిశుద్ధ్య పనులు అటకెక్కుతున్నాయి. ఏ పల్లెను చూసినా రహదారులపై పారే మురుగు, అధ్వాన్న పరిసరాలే కనిపిస్తున్నాయి. సంవత్సరానికి అన్ని మండలాలకు కలిపి, రూ.90 కోట్ల మేర నిధులు వచ్చినా పల్లెల్లో



పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదు. వీటితో పాటు పంచాయతీలకు సంతలు, వివిధ గ్రాంట్ల ద్వారా ఆదాయం సమకూరుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే చేతిపంపులు, బావుల వద్ద సైతం కనీసం బ్లీచింగ్ చల్లడం, పారిశుద్ధ్య చర్యలను చేపట్టడం లేదు.

**నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు..**

దోమల నివారణకు వినియోగించే ఫాగింగ్ యంత్రాలు జిల్లాలో 225 మాత్రమే ఉన్నాయి. వీటిని సైతం పంచాయతీల్లో వృథాగా ఉంచారు. ఎక్కడా వినియోగించడం లేదు. మరో 100 పంచాయతీలకు ఈ యంత్రాలు సైతం లేవు. ఒక్కొటి రూ.40 వేల చొప్పున రూ.90 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినా, ప్రజలకు అక్కరకు రాకుండా ఉంటున్నాయి. మలేరియా జ్వరాలతో గూడేల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

**వసూలు సరే..** జిల్లా కేంద్రంలో చెత్తను తీసుకెళ్లడానికి పంచాయతీ అధికారులు ప్రతీ ఇంటి నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. అంతకుముందు ఉచితంగా చెత్తను వాహనాల్లో పంచాయతీ సిబ్బంది తీసుకెళ్లేవారు. రెండు నెలల నుంచి ప్రైవేటుకు అప్పచెప్పడంతో ఈ డబ్బులు తీసుకుంటున్నారు. ఈ చెత్తను తీసుకెళ్లే వాహనాలు సైతం నాలుగైదు రోజుల ఒకసారి వస్తున్నాయి. ఈ లోపు పట్టణమంతా అస్తవ్యస్తంగా మారుతోంది.

**పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.. – రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి**

జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేపడతాం. ఫాగింగ్ యంత్రాలను సైతం అన్ని ప్రాంతాల్లో వినియోగించేలా చూస్తాం.

**చేతిపంపు చుట్టూ మురుగు..**

ఆసిఫాబాద్ మండలం జెండగూడ గ్రామంలో ఉన్న చేతిపంపు ఇది. చుట్టూ నిలిచిన మురికి నీటిలోనే గ్రామస్థులు తాగునీరు పట్టుకుంటున్నారు. ఈ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఈ ఒక్క చేతిపంపే 25 కుటుంబాల దాహార్తి తీర్చుతుంది.

**నిలిచిన నీరు ఆరోగ్యానికి చేటు**

జన్కాపూర్‌లోని బీసీ బాలికల సంక్షేమ వసతిగృహం ముందు నిలిచిన నీరు. వర్షం నీరు కాదు పైనుంచి వస్తున్న మురుగు నీరంతా ఇక్కడ నిల్వ ఉండటంతో వసతిగృహ విద్యార్థులతో పాటు, సమీప కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి.

**కానరాని కనీస చర్యలు**

జిల్లా కేంద్రంలోని సబ్‌జైలు వెనకాల మురికి కాలువలు నిండి రహదారులపై పారుతున్న మురుగు. ఈ చిత్రం అధికారుల పారిశుద్ధ్య చర్యలను తేటతెల్లం చేస్తుంది. నిరంతరం మురికి నీటి ప్రవాహంతో ఈ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులు సైతం అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల బెజ్జూరు మండలంలో సలుగుపల్లి గ్రామంలో డయేరియా ప్రబలడానికి అక్కడి వారు వినియోగిస్తున్న చేతిపంపు చుట్టూ మురుగు ఉండటమే కారణమని అధికారులు ప్రాథమికంగా తేల్చారు.

# సిరులు కురిపించే సిరాల

ఆదిలాబాద్ : దుర్భిక్షంతో అల్లాడిన ప్రాంతంలో పసిడి పంటలు పండించేలా అప్పటి పాలకులు నిర్మించిన ప్రాజెక్టుతో ఇక్కడి బీడు భూములు సాగులోకి వచ్చాయి. సుమారు 135 సంవత్సరాల క్రితం నిర్మాణం పూర్తి చేసుకున్న భైంసా మండలంలోని సిరాల చెరువు అప్పట్లో 1700 ఎకరాలకు సాగు నీరందించింది. అయిదు గ్రామాల శివారు భూములకు సాగు నీరందించేందుకు 9కి.మీల ప్రధాన కాలువ నిర్మించారు. పొలాలకు నీరందించే పిల్ల కాలువల ద్వారా నీటిని వదిలేందుకు తూములు ఏర్పాటు చేశారు. తద్వార సిరాలతోపాటు ఇలేగాం, మచ్కల్, ముద్గల్, దేగాం, వాలేగాం వరకు పచ్చని పంటలతో సస్యశామలంగా మారింది. మొదట్లో వారి నాటు వేయడం తెలియని ఈ ప్రాంత రైతులకు అధికారులు ఇతర ప్రాంతాలనుంచి కూలీలను రప్పించి నాట్లు వేయించారని వ్యవసాయ కుటుంబంలోని వృద్ధులు తెలుపుతున్నారు. జపాన్ పద్ధతిలో దారం వేసి వరుస నాట్లు వేసేవారని పేర్కొంటున్నారు. కూలీల కొరత కారణంగా వరుస నాట్లు పోయి మామూలుగా వేయడం అలవాటై పోయిందంటున్నారు. ఎండాకాలం ఇక్కడి చుట్టు పక్కల ప్రాంత పశువుల దాహం తీర్చేందుకు ఈ చెరువే ఆధారం. ఇప్పటికి రెండు పంటలకు సరిపడ నీరందిస్తున్న చెరువు కట్ట రెండు గుట్టల మధ్య 175మీటర్ల పొడవు మాత్రమే ఉండడం విశేషం. ఇప్పటికి నిర్ణిత సామర్థ్యం మేరకు 24అడుగుల జలసిరితో కళకళలాడుతోంది. అప్పట్లో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం నిజాం పాలన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లోకి చేరింది. ప్రతి పర్వదినాల్లో ఇక్కడి గుట్టపైన ఉన్న మహాదేవాలయానికి వచ్చే భక్తులు నాటు పడవల్లో చెరువు నీటిలో ప్రయాణించి సందడి చేస్తారు. పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రంత ప్రజలకు మరింత ఆహ్లాదం అందించన వారుతారని స్థానికులు కోరుతున్నారు.

# అద్దె భవనాల్లో.. సర్కారీ కార్యాలయాలు



బోథ్ : ప్రజావసరాలను తీర్చే ప్రభుత్వ అధికారులు కొలువై ఉండే సర్కారు కార్యాలయాలు అద్దె గదుల్లో, అధ్వాన పరిస్థితుల నడుమ కొనసాగుతున్నాయి. ఉద్యోగులకు నిలువ నీడ కరవైంది. ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఒంటికి, రెంటికీ వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. నిత్యం వందలాది ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. అధికారులతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు సైతం ఒంటికి, రెంటికి వెళ్లలేని దుస్థితి నెలకుంటోంది.

**అద్దె చెల్లించలేని దుస్థితిలో..** జిల్లాలో కొత్తగా ఏర్పడిన మావల మండలానికి ఎంపీడీఓ కార్యాలయం కొద్ది కాలం అద్దె భవనంలో కొనసాగింది. అద్దె చెల్లింపుల్లో అలసత్వంతో భవనం ఖాళీ చేయాల్సి వచ్చింది. మండలంలో భవనాలు లభించకపోవడంతో చేసేదేమీ లేక అధికారులకు విజ్ఞప్తి చేసి ఖాళీగా ఉన్న విద్యాశాఖకు చెందిన భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.

**సొంత స్థలం ఉన్నా..**

ఈ కార్యాలయం బోథ్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నేళ్లుగా అద్దె చెల్లిస్తూ ప్రైవేటు భవనంలో కార్యకలాపాలను సాగిస్తున్నారు. కోర్టుకు సొంత స్థలం ఉన్నా ప్రభుత్వ నిధులు వెచ్చించడం, పనులు ప్రారంభించడంలో అలసత్వం వహిస్తుండటంతో పనులు ప్రారంభించలేని పరిస్థితి. దీంతో ఇరుకు గదుల నడుమ ప్రైవేటులోనే కొనసాగుతోంది.

**భవనం దొరకక అవస్థ**

బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాల ప్రజలు ఉద్యోగులు, గుత్తేదారులు తమ నెల జీతాల కోసం, బిల్లుల చెల్లింపుల కోసం వచ్చే ఉపకోశాధికారి కార్యాలయం ఇది. నాలుగు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఈ కార్యాలయం సొంత భవనం లేక తీవ్ర ఇబ్బందుల మధ్య మార్కెట్ కమిటీ ఆవరణలోని ఓ భవనంలో కొనసాగుతోంది. కార్యాలయాన్ని ఎక్కడ నిర్వహించాలో తెలియక ఇక్కడికి చేర్చారు. ఈ భవనం సైతం శిథిలావస్థకు చేరుతుండటంతో బిక్కుబిక్కుమంటూ విధులను కొనసాగిస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు వచ్చే ఈ కార్యాలయానికి సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాశ్వత భవనాన్ని నిర్మించాలని ప్రజలు, అధికారులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

**ఇబ్బందుల నడుమ..** ఉట్నూరు మండల కేంద్రంలోని ఆబ్కారీ శాఖ కార్యాలయం అవస్థల నడుమ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఉట్నూరు, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పర్యవేక్షించాల్సిన సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

**రికార్డులు భద్రపర్చలేని స్థితిలో..** ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆబ్కారీ శాఖ కార్యాలయం ఇది. ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. వర్షాకాలం వరద పాటు, వర్షపు నీరు కార్యాలయంలోకి చేరుతుండటంతో రికార్డులను భద్రపర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

**కొత్తది నిరుపయోగం**

బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాల ప్రజలకు అందుబాటులో ఉన్న బోథ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. కొన్నేళ్ల కిందటే ఈ కార్యాలయానికి సొంత భవనాన్ని నిర్మించినా, చిన్న చిన్న పనులు పూర్తికాక ఇంకా అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. నూతన భవనం సైతం ఉపయోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుతోంది.

# రూ. కోట్లు ఆవిరి.. వినియోగించే వారేరి?



ఉట్నూరు : ఐటీడీఏ పాఠశాలల్లో రూ.కోట్ల నిధులుపోసి కొన్న పరికరాలను వినియోగించడంలేదు. గుత్తేదారుల జేబులు నింపేందుకు వీటిని కొన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీస అవగాహన లేకుండా రెండేళ్ల కిందట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలకు స్టీం కుక్కర్లను పంపిణీ చేసి, వినియోగించకుండా వదిలేయడంతో తుప్పుపడుతున్న దుస్థితి దాపురించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 132 ఆశ్రమ పాఠశాలలు ఉండగా.. వీటిలో ప్రతి పాఠశాలకు స్టీం కుక్కర్లను ఐడబ్ల్యూఐడీసీ(ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రెండేళ్ల కిందట పంపిణీ చేశారు. ఒక్కో దానికి దాదాపు రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు. వీటిలో చాలా వరకు నేటికి ఉపయోగించకుండా మూలనపడి తుప్పుపడుతున్నాయి.

**ఎవరికి లాభం?**

ప్రస్తుతం గ్యాస్ పొయ్యిల ద్వారా విద్యార్థులకు ఆహారం వండి పెడుతున్నారు. దాదాపు 300 మందిలోపు విద్యార్థులు ఉంటే వంట చేసేందుకు గ్యాస్ పొయ్యిల ద్వారా ఇబ్బందులుండవు. అంతకు మించి విద్యార్థులు ఉన్న చోట స్టీం కుక్కర్లు తప్పనిసరి. కానీ నేటికి చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 300లోపు మాత్రమే ఉన్నారు. వీరికి స్టీం కుక్కర్లపై వంట చేయడంతో గ్యాస్ వినియోగం భారీగా పెరిగి నష్టాలు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. మరోవైపు అవసరం ఉన్న చోట కాకుండా అడ్డగోలుగా పంపిణీ చేసి చేతులు దులుపేసుకోవడం, వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో.. రూ.6.60కోట్ల నిధులు ఖర్చు చేసినా ఫలితం కనిపించడం లేదు.

**చర్యలు తీసుకుంటున్నాం : దిలీప్ కుమార్, డీడీ**

ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసిన విషయం వాస్తవమే. కరోనా నేపథ్యంలో రెండేళ్ల పాటు వినియోగించలేదు. దాంతో నిరుపయోగంగా మారాయి. సరఫరా చేసిన సంబంధిత యాజమాన్యంతో మాట్లాడాం. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా మరమ్మతులు చేపడుతున్నాం. అవసరమైతే వంట నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా చూస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న ఆశ్రమ పాఠశాలల నుంచి వాటిని తీసుకెళ్లి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నాం.

**ఇలా గాలికి వదిలేశారు**

చిత్రంలో కనిపిస్తున్న స్టీం కుక్కర్లు గాదిగూడ మండలంలోని ఝరి బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందినవి. రూ.లక్షలు వెచ్చించి కొన్నా వీటికి కనీసం రక్షణ లేకపోగా ఇలా బయట వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ తుప్పు పడుతున్నాయి. కనీసం వాటిని గదిలో భద్రంగా ఉంచే పరిస్థితి లేదు.

**నిరుపయోగంగా..** ఈ చిత్రంలో కనిపిస్తున్న స్టీం కుక్కర్లు సిరికొండ మండలంలోని రాయిగూడ బాలుర ఆశ్రమ పాఠశాలలోనివి. ఇప్పటి వరకు వీటిని వినియోగించిన దాఖలాలు లేవు. నేటికి గ్యాస్ పొయ్యిపైనే వంట చేస్తున్నారు. వీటిపై వండేందుకు సరిపడా విద్యార్థులు లేకపోవడంతో వీటి అవసరం లేక పట్టించుకునే పరిస్థితి లేదు.

# శిథిల భవనం.. సమస్యల నిలయం

భైంసా : భైంసా ప్రాంతీయాసుపత్రి రెండున్నర దశాబ్దాలకే శిథిలావస్థకు చేరుకుంది. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, రోగులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. భైంసాతోపాటు ముథోల్ నియోజకవర్గం, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల రోగులకు 24 గంటలపాటు వైద్య సేవలు అందిస్తుంది. పురాతనమైన సివిల్ ఆసుపత్రిని 100 పడకలతో ప్రాంతీయాసుపత్రిగా ఉన్నతీకరించారు. రెండు ఎకరాల విస్తీర్ణం గల ఆసుపత్రిని 1997 సంవత్సరంలో నిర్మించారు. అప్పటి గుత్తేదారు ఇష్టారాజ్యాంగా పనులు చేశారనే విమర్శలున్నాయి. రెండు దశాబ్దాలకే భవనం ఊరుస్తూ పెచ్చులూడుతున్నాయి. దీనికి తోడు మురుగు ప్రవాహ వ్యవస్థ సక్రమంగా లేక పైపులు పూడుకుపోయి మురుగు ఎక్కడికక్కడే నిలుస్తోంది. మెటర్నిటి, మేల్ తదితర విభాగాల్లో రోగులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు గదులు వినియోగించుకునేందుకు అనుకూలంగా లేకపోవడంతో నిరుపయోగమై వారు ఇబ్బందులు పడుతున్నారు. పొరపాటున వాటిని వినియోగిస్తే వాటి కింద ఉన్న ఎన్‌బీఎస్‌యూ(శిశుసంరక్షణ) ఇతర విభాగ గదుల్లో మురుగు చేరి అపరిశుభ్రత నెలకొంటోంది. వివిధ విభాగాల మురుగు పైప్‌లైన్ రక్తనిధి కేంద్రం గదుల కింది నుంచి ఉండడంతో మరమ్మతులు చేసేందుకు అవాంతరాలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. ఇదీ ఇక్కడ పరిస్థితి.. రోజుకు 50–100 మంది ఇన్‌పేషంట్లుగా, వెయ్యి మందికి పైగా రోగులు ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందుతున్నారు.

? ఆసుపత్రి నిర్వహణకు ఇప్పటి వరకు రెగ్యులర్ పర్యవేక్షణాధికారిని నియమించకపోవడంతో ఇన్‌చార్జి అధికారితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ? ఆర్థో వైద్యుడు, సీఆర్మ్ మిషన్ ఉన్నా అందుకు ఉపయోగించే పరికరాలు లేకపోవడంతో శస్త్రచికిత్సలు చేయడం లేదు. ? దంత వైద్య విభాగంలో కుళాయి నీరు రాదు. ? మూడు బోరు మోటార్లు ఉండగా ప్రస్తుతం రెండు మాత్రమే పనిచేయడంతో తరచు నీటి సమస్య ఎదుర్కోవాల్సి వస్తుంది. నిధుల జాడలేదునాలుగు సంవత్సరాల నుంచి ఆసుపత్రి మరమ్మతులకు నిధులు లేవు. అభివృద్ధి కోసం ఇప్పటి వరకు నాల్గుసార్లు వివిధ సర్వే అధికారుల బృందాలు నివేదికలను రూపొందించి ప్రభుత్వానకి ప్రతిపాదిస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

సమస్యలను పరిష్కరిస్తున్నాంఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై టీఎస్‌ఎంఐడీసీకి నివేదించాం. వివిధ విభాగాల్లో మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.82 లక్షల నిధులు మంజూరు చేయగా పనులు చేపట్టేందుకు మూడు సార్లు టెండర్లు నిర్వహించగా ఎవరూ ముందుకు రాలేదు. నాలుగోసారి ఓ గుత్తేదారు ముందుకు వచ్చినట్లు తెలిసింది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. ఆయా విభాగాల్లో సమస్యలు తలెత్తకుండా రోగులకు ఇబ్బందులు ఏర్పకుండా వాటి పరిష్కారానికి పలువురు వైద్యులకు పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. – యు.కాశీనాథ్, ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారి, ప్రాంతీయాసుపత్రి, భైంసా

పనిచేస్తున్న వైద్యులు : 17 నర్సులు, పారామెడికల్, క్లరికల్, సహాయ, ఒప్పంద.. విభాగాల సిబ్బంది : 117

# పత్తికి కొత్త తెగులు

ఆదిలాబాద్ :బోథ్ మండలం రాంనగర్‌కు చెందిన రైతు చందర్‌సింగ్.. ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. అధిక వర్షాలతో పంటలో ఎదుగుదల లోపించింది. వర్షాలు తగ్గిన తర్వాత పంట పెరుగుతుందని, అవసరమైన ఎరువులు వేసి ఎదురుచూస్తున్న తరుణంలో మొక్కలు వాటంతట అవే విరిగిపోయి ఎండిపోవడం గమనించాడు. ఏ మందు పిచికారి చేయాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో అనుకూలంగా వర్షాలు కురవడంతో సాధారణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. పంటలు ఏపుగా పెరుగుతున్న సమయంలో జులై, ఆగస్టు నెలల్లో ఎక్కువ వర్షాలు పడటంతో కొన్ని గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. జరిగిన నష్టం నుంచి తేరుకొని ఉన్న పంటలను కాపాడుకుందామనుకుంటే కొత్త తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో పత్తిని 3.97 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. సీజన్ మొదట్లో వర్షాలు అనుకూలంగా ఉండటం, ప్రభుత్వం పత్తి వేయాలని సూచించడంతో.. రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. వరుస వర్షాలతో పంటలో కలుపు ఎక్కువ కావడం, పోషక లోపాలు ఏర్పడటంతో పాటు పలు రకాల తెగుళ్ల కారణంగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల తీవ్రతను తెలుసుకునే ప్రయత్నంలో శాస్త్రవేత్తలు జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. పంట పండితేనే.. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. తెగుళ్లు ఆశించడంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పంటను కాపాడుకోవడానికి రూ.వేలు ఖర్చు చేసి మందులు పిచికారి చేస్తున్నారు.

**ఎప్పుడూ లేని విధంగా..**

పత్తి పంటను అనేక రకాల తెగుళ్లు చుట్టుముట్టినా రైతులు వేల రూపాయిలు వెచ్చించి వాటిని నివారించి పంటను కాపాడుకుంటారు. అయితే ఈ ఏడాది భిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పత్తి మొక్క ఎదిగే సమయంలోనే కాండం లోపలికి పురుగు వెళ్లి కాండంను తినేయడంతో మొక్క విరిగిపోతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. గతంలో ఇలాంటి పురుగు పత్తిని ఆశించలేదని చెబుతున్నారు. దీనికి తోడు అధిక వర్షాలతో తేమ



ఎక్కువగా ఉండటంతో ఎప్పుడు ఉండే తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక వారిని ముప్పుతిప్పలు పెడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు ఎర్రబారిపోయి ఎండిపోతున్నాయని వాపోతున్నారు. కాలం అనుకూలిస్తే.. పత్తిలో ఎకరానికి 8–10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అలాంటిది నాలుగైదు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాజశేఖర్‌ను వివరణ కోరగా.. 'పత్తి మొక్కలు పడిపోయి ఎండిపోతున్నట్లు సమాచారం ఉంది. సాధారణంగా ఇలాంటి పరిస్థితి భిన్న వాతావరణం, అటవీ ప్రాంతాలకు దగ్గర ఉన్న పంట పొలాల్లో ఉంటుంది. రైతులు చెప్పిన దాని మేరకు పత్తిని ఆశించిన పురుగు కాండం ముక్కు పురుగుగా భావిస్తున్నాం. పత్తి పంటలో ఇది తొలిసారి కనబడుతోందని, ప్రాథమిక నివారణకు ప్రస్తుతం కార్బోఫ్యూరాన్ 3జీ 10కిలోలు క్లోరిఫైరిఫాస్ 50ఈసీ ఐదు ఎం.ఎల్ లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పడేలా పిచికారి చేయాలి. లామ్డాస్కైలోత్రిన్‌ం క్లోరంత్రనిప్రోల్ 80ఎం.ఎల్ ఎకరానికి కలిపి పిచికారి చేయాలని' ఆయన వివరించారు.?

గుడిహత్నూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సూర్యభానుకు చెందిన పత్తి పంట ఇది. అధిక వర్షాలతో కలుపు ఎక్కువ కావడం, మందులు పిచికారి చేసినా ఉపయోగం లేకపోవడం, కలుపు తీయడానికి కూలీల ఖర్చు ఎక్కువ అవడంతో పంటను అలాగే వదిలేశారు. కలుపు ఎక్కువై ప్రధాన పత్తి మొక్కలు కనిపించకుండా అయ్యాయి.

జిల్లా సాధారణ సాగు–5.23 లక్షల ఎకరాలు
సాగైంది– 5.47 లక్షల ఎకరాలు
రైతులు– 1.47 లక్షలు
పత్తి – 3.97 లక్షలు ఎకరాలు
ముంపునకు గురై నష్టం– 1.03 లక్షల ఎకరాలు
నష్టపోయిన రైతులు– 27 వేల మంది

# నీతి ఆయోగ్ బృందం పర్యటన

ఖమ్మం : బోనకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర నీతి ఆయోగ్ బృందం సందర్శించింది. ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ప్లాన్ పరిశీలన కోసం ఈ బృందం పీహెచ్‌సీతో పాటు ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేసింది. బృందం సభ్యులు మధుబిద్రి, ప్రభుస్వామి, జిల్లా ప్రోగ్రాం అధికారి సైదులు, ఎన్‌హెచ్‌ఎం సమన్వయకర్త నీలోహన ఉన్నారు. అన్ని జాతీయ కార్యక్రమాల పరిశీలనతో పాటు ఓపీ సేవలు, ల్యాబ్, ఫార్మసీ, గర్భిణుల నమోదు, బాలింతల గృహ సందర్శన, వారికి అందుతున్న సేవల్ని పరిశీలించారు. టి.బి., కుష్టు, మధుమేహం వ్యాధిగ్రస్థులకు ఆశాలు, ఏఎన్ఎంల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. బ్రాహ్మణపల్లి పల్లె దవాఖానాలో సేవల్ని వైద్యులు గ్రీష్మను అడిగి తెలుసుకున్నారు. దస్త్రాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు బాలకృష్ణ, సీహెచ్‌వో శ్రీనివాసరావు, స్టాఫ్‌నర్స్ భవాని, ఆరోగ్య పర్యవేక్షకులు స్వర్ణమార్త, దానయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.




# టీడీపీలోకి కోటంరెడ్డికి ఆహ్వానం.. మరి ఎమ్మెల్యే నిర్ణయం ఏంటంటే?..

నెల్లూరు: అధికార పార్టీ వైసీపీకి దూరంగా ఉన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని తమ పార్టీలోకి రావాల్సిందిగా టీడీపీ ఆహ్వానించింది. నెల్లూరు జిల్లాలో టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈరోజు జిల్లాలోని టీడీపీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర నివాసంలో ఆ పార్టీ ముఖ్యనేతలు భేటీ అయి కోటంరెడ్డిని టీడీపీలోకి రావాల్సిందిగా ఆహ్వానం పలికారు. అందుకు కోటంరెడ్డి కూడా సుముఖత వ్యక్తం చేశారు. దీనిపై కోటంరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ పార్టీకి దూరంగా జరిగిన తనను టీడీపీ పార్టీలోకి ఆహ్వానించినందుకు తెలుగుదేశం సీనియర్ నాయకులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, అబ్దుల్ అజీజ్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్రకు తనను నిర్వహించాలని టీడీపీ పార్టీ నాయకులు ఆహ్వానించడం సంతోషకరమన్నారు. నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ సలహా సూచనలతో లోకేష్ పాదయాత్ర విజయవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను నా భూతో నా భవిష్యత్తు అన్న రీతిలో విజయవంతం చేస్తామని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ... వైసీపీ పార్టీ పతనం నెల్లూరు నుంచే మొదలైందన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆయన అనుచరులకు స్వాగతం పలికామని తెలిపారు. కాకాణి మంత్రి అయ్యాక పార్టీలో ముగ్గురు ఎమ్మెల్యేలు బయటకు వచ్చారన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలను గెలిచామని అన్నారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ... నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నెల్లూరు సిటీ నియోజకవర్గంలో విజయవంతంగా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. 2024లో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీలోకి రావడం చాలా సంతోషమన్నారు. నెల్లూరు జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీలోకి రావడం చాలా సంతోషమన్నారు. జగన్ ప్రభుత్వం మీద ప్రజలందరూ చాలా విసిగిపోయి ఉన్నారని పేర్కొన్నారు.

# ఎన్నికలకు 9 నెలల ముందు ఆంధ్రప్రదేశ్ అద్వితీయ ప్రగతి

## పరిపాలనా వికేంద్రీకరణతో ప్రజల ముంగిటకు ప్రభుత్వం




ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభకు ఎన్నికలు జరగడానికి 9 నెలల ముందు రాష్ట్రం ప్రగతిపథంలో ఉరకలు పెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి నేతృత్వంలో నాలుగేళ్ల క్రితం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన కృషి అన్ని రంగాల్లో సత్ఫలితాలు ఇస్తోంది. సాధారణంగా ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయనగా ఏ రాష్ట్రంలోని పాలకపక్షమైనా విజయాలు, వైఫల్యాలు బేరీజు వేసుకుంటూ ఆందోళనతో ముందుకు నడుస్తుంది. అయితే, ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూర్తి విశ్వాసంతో, విజయోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో 98.5 శాతం నెరవేర్చామని మూడున్నర నెలల క్రితం సీఎం గారు చెప్పిన మాటలు ముమ్మాటికీ నిజం. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి అన్ని రంగాల్లో ప్రభుత్వం తెచ్చిన మార్పుల ఫలితంగా ఏపీ 11.23 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. వివిధ సంక్షేమ పథకాల కింద ప్రజలకు రూ.1,97,473 కోట్ల సొమ్ము అందజేసి ఈ ఏడాది బడ్జెట్ నాటికి ఏపీ సర్కారు నగదు బదిలీలో కొత్త రికార్డు సృష్టించింది. క్షేత్రస్థాయిలో ఐదున్నర కోట్ల ఆంధ్రులకు మేలు జరిగేలా 13 జిల్లాలను 26కు, 51 రెవెన్యూ డివిజన్లను 76కు పెంచింది. అలాగే టీడీపీ హయాంలో వైద్యకళాశాలలు 11 ఉండగా కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ క్రమంలో వికేంద్రీకరణ ద్వారా అన్ని ప్రాంతాల అభివృద్ధి సమంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటోంది.

**పారిశ్రామికాభివృద్ధికి వినూత్న ప్రాజెక్టులు :** తోటి తెలుగు రాష్ట్రంతో పోల్చితే చారిత్రక కారణాల వల్ల పారిశ్రామిక రంగంలో అంత ముందు లేని ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చేసే ప్రాజెక్టును వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోంది. రాష్ట్రంలో బంగాళాఖాతం తీరం వెంబడి 800 కిలో మీటర్ల పొడవున విశాఖపట్నం–చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) నిర్మాణం పూర్తయితే నవ్యాంధ్ర దక్షిణాదిలో పారిశ్రామిక కేంద్రంగా మారుతుంది. భారత దేశపు తొలి కోస్తా కారిడార్ అయిన తూర్పు తీర ఆర్థిక కారిడార్ (ఈసీఈసీ)లో అంతర్భాగంగా వీసీఐసీ ఏర్పాటవుతోంది. ఈ ఆర్థిక కారిడార్ ను ఉపయోగించుకుని ఆగ్నేయాసియా, తూర్పు ఆసియా దేశాలతో ఆర్థిక సంబంధాలు గణనీయంగా పెంచుకోవచ్చు. 'మేకిన్ ఇండియా' లక్ష్య సాధనకు వీసీఐసీ ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ కోస్తా కారిడార్ అభివృద్ధి ప్రణాళికలో కీలక భాగాలుగా విశాఖపట్నం, మచిలీపట్నం, దొనకొండ, యేర్పేడు–శ్రీకాళహస్తి పారిశ్రామిక కేంద్రాలు పనిచేస్తాయి. 2019 నాటికి లక్షా పది వేలకు పైగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార (ఎంఎస్ ఎంఈ) యూనిట్ల సంఖ్య ఈ నాలుగేళ్లలో దాదాపు లక్షా 56 వేలకు పెరిగింది. అధికార వికేంద్రీకరణ, ప్రజా సేవల విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన పదిహేను వేలకు పైగా గ్రామ, వార్డు సచివాలయాలు, దాదాపు 11 వేల రైతు భరోసా కేంద్రాలు ప్రజలకు ఆరొందలకు పైగా పౌర సేవలు అందిస్తున్నాయి. వైఎస్సార్సీపీ సర్కారు పేరును తెలుగునాట చిరస్థాయిగా నిలిపే వాలంటీర్ల వ్యవస్థ ఎంతో డైనమిక్ పాత్ర పోషిస్తోంది. మున్నెన్నడూ కనీవినీ ఎరగని రీతిలో 2,65,000 మంది వాలంటీర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వినూత్న రీతిలో సేవలందిస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున ఈ వాలంటీర్లు ఆంధ్ర జనానికి ఆసరాగా నిలుస్తున్నారు. ఈ కొత్త సేవల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముంగిటకు వచ్చినట్టయింది. అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా 9 నెలల ముందు ఇంత చలనశీలతతో, ప్రగతిశీలంగా పనిచేస్తున్న పాలకపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ 2024 ఏపీ శాసనసభ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధిస్తుందన్నది ఆంధ్రప్రజల నోట ఈ మధ్య పదే పదే వినిపిస్తున్న మాట.

## వైయస్ జగన్‌ను కలిసిన బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ షెల్లి సలేహిన్



తాడేపల్లి: ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ (చెన్నై, సౌత్ ఇండియా) షెల్లి సలేహిన్ కలిశారు. ఏపీలో వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, టెక్నాలజీ వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రితో సెల్లి సలేహిన్ చర్చించారు. ఈ సందర్భంగా షెల్లి సలేహిన్‌ను సీఎం వైయస్ జగన్ సత్కరించి, జ్ఞాపిక బహుకరించారు. సమావేశంలో సీఎం స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## పవన్ ప్రసంగాలు ఉన్మాదానికి ఎక్కువ.. పిచ్చికి తక్కువ..




అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ పవన్ వారాహి యాత్ర అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ఆయన ప్రసంగాలు ఉన్మాదానికి ఎక్కువ.. పిచ్చికి తక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పవన్ తనను తాను విప్లవ కారుడునని చెప్పుకుంటారని, గోదావరి జిల్లాల్లో ఒక్క సీటు కూడా వైసీపీకి రాకుండా అడ్డుకుంటారా? అన్నారు. సమయం సందర్భం లేకుండా కాపు ఉద్యమనేత ముద్రగడపై పవన్ ఆరోపణలు చేస్తారా?.. ముద్రగడపై పవన్ చేసిన ఆరోపణల వల్ల కాపుల మనోభావాలు దెబ్బతిన్నాయని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. పవన్ తిరిగేదంతా కాపు సామాజిక వర్గాలు ఉండే ప్రాంతాలేనని, వారి మనోభావాలు దెబ్బతీసే ప్రయత్నం ఇదని.. కాపుల్లో చీలిక తెచ్చే ప్రయత్నంగా భావిస్తున్నామని అన్నారు. రైలు దహనం కేసులో ముద్రగడ చాలా అపవాదులు ఎదుర్కొన్నారని, కులాల చిచ్చు రగిల్చేది పవనేనని.. మళ్ళీ సుద్దులు చెప్పేది ఆయనేనని అన్నారు. పవన్ ప్రసంగాలు ఆయన మానసిక పరిస్థితి ఏమిటో తెలియచేస్తున్నాయన్నారు.

# ఏపీ మరో రూ. 2వేల కోట్ల అప్పు...

అమరావతి: ఏపీ ప్రభుత్వం మరో రూ. 2వేల కోట్లు అప్పు తీసుకువచ్చింది. సెక్యూరిటీ బాండ్ల వేలంలో రూ. వెయ్యి కోట్లు 20 ఏళ్లకు 7.42 శాతం వడ్డీతో రుణం తీసుకోగా.. మరో రూ. 5 వందల కోట్లు 18 ఏళ్లకుగానూ 7.42 శాతం వడ్డీతో అప్పు తెచ్చారు. మరో రూ. 5 వందల కోట్లు 16 ఏళ్లకుగానూ 7.43 శాతం వడ్డీతో అప్పు తెచ్చింది. ఎఫ్ఆర్‌బీఎంలో జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ ఏడాది రూ.22,500 కోట్ల అప్పు తెచ్చింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం రుణ పరిమితిలో రూ.8 వేల కోట్లే మిగిలాయి. 84 రోజుల్లో సెక్యూరిటీ బాండ్ల వేలంలో రూ.22,500 కోట్ల అప్పు తెచ్చి జగన్ సర్కార్ రికార్డ్ సృష్టించింది. ఏపీ అప్పులు అపరిమితంగా పెరిగిపోతుండడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలపై రుణ భారం పెరిగిపోతోంది.







అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రపంచ కప్ షెడ్యూల్ వచ్చేసింది. భారత్‌లో అక్టోబర్–నవంబర్‌లో జరగనున్న ఈ మెగా టోర్నీలో మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. అక్టోబర్ 5న అహ్మదాబాద్ వేదికగా ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్‌తో ఈ మహా సమరం మొదలుకానుంది. లీగ్ దశలో టీమ్ఇండియా 9 మ్యాచ్‌లు ఆడనుంది. అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో భారత్ తన తొలి మ్యాచ్‌లో తలపడనుంది. అహ్మదాబాద్ వేదికగా అక్టోబర్ 15న చిరకాల ప్రత్యర్థులైన భారత్–పాక్ మ్యాచ్ జరగనుంది. నవంబర్ 15, 16న ముంబయి, కోల్‌కతా వేదికగా సెమీ ఫైనల్ మ్యాచ్‌లు.. అహ్మదాబాద్ వేదికగా నవంబర్ 19న ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. రెండు సెమీ ఫైనల్స్‌తోపాటు ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే (నవంబర్ 20) ఉంది. ధర్మశాల, దిల్లీ, లఖ్‌నవూ, పుణె, ముంబయి, అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వేదికలుగా మ్యాచ్‌లు జరగనున్నాయి. హైదరాబాద్ మూడు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. పాకిస్థాన్ రెండు వేదికలు (చెన్నై, బెంగళూరు) తమకు అనుకూలంగా లేవంటూ అభ్యంతరం వ్యక్తం చేయగా.. ఐసీసీ దానిని పట్టించుకోలేదు.

**భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్ :** అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో (చెన్నై) అక్టోబర్ 11న అఫ్గానిస్థాన్‌తో (దిల్లీ) అక్టోబర్ 15న పాకిస్థాన్‌తో (అహ్మదాబాద్) అక్టోబర్ 19న బంగ్లాదేశ్‌తో (పుణె) అక్టోబర్ 22న న్యూజిలాండ్‌తో (ధర్మశాల) అక్టోబర్ 29న ఇంగ్లాండ్‌తో (లఖ్‌నవూ) నవంబర్ 2న క్వాలిఫయర్ 2తో (ముంబయి) నవంబర్ 5న సౌతాఫ్రికాతో (కోల్‌కతా) నవంబర్ 11న క్వాలిఫయర్ 1తో (బెంగళూరు)




భోపాల్: అత్యాధునిక సదుపాయాలు కలిగిన సెమీహైస్పీడ్ వందే భారత్ రైళ్ల ప్రస్థానంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఒకే రోజు అయిదు కొత్త వందే భారత్ రైళ్లు పట్టాలెక్కాయి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జెండా ఊపి వీటిని ప్రారంభించారు. పలు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలను అనుసంధానించేలా ఈ రైళ్ల సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం భోపాల్‌లోని రాణి కమలాపతి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ప్రధాని.. భోపాల్(రాణికమలాపతి)–జబల్‌పుర్‌బీ ఖజురహో–భోపాల్–ఇండౌర్‌బీ హతియా–పట్నాబీ ధార్వాడ్–బెంగళూరుబీ గోవా(మడ్గావ్)–ముంబయి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. ఇందులో రెండు రైళ్లను భౌతికంగా, మిగతా మూడు రైళ్లను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వందే భారత్ రైల్లో చిన్నారులతో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల్, రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్రమంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, జ్యోతిరాదిత్య సింధియా తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఒకే రోజు ఒకటికంటే ఎక్కువ వందేభారత్ రైళ్లను ప్రారంభించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఉదయం భోపాల్ ఎయిర్‌పోర్టు నుంచి రాణి కమలాపతి రైల్వే స్టేషన్‌కు ప్రధాని హెలికాప్టర్‌లో రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించలేదు. దీంతో రోడ్డు మార్గం ద్వారా ఆయన స్టేషన్‌ను చేరుకున్నట్లు భాజపా రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జ్ ఆశిష్ అగర్వాల్ తెలిపారు. ఇదిలా ఉండగా.. మధ్యప్రదేశ్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఒకేసారి రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆ ధైర్యంతోనే సీఎం జగన్ అరాచకాలు..




అమరావతి: మాలల్లో వచ్చిన చైతన్యంతో రాష్ట్రానికి పట్టిన శని వదులుతుందని నమ్ముతున్నానని, ఇందిర, వైఎస్, జగన్ వెంటే మాలలు ఉన్నారనే ప్రచారానికి మీరే చెక్ పెట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పిలుపిచ్చారు. మంగళవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలోఅచ్చెన్న మాట్లాడుతూ కొన్ని వర్గాల ఓట్లు తనకే పడతాయన్నది ఇప్పటికీ జగన్మోహన్ రెడ్డి ధైర్యమని, ఆ ధైర్యంతోనే అరాచకాలు చేస్తున్నారని విమర్శించారు. దళితులకు అన్యాయం జరుగుతుంటే కొంతమంది దళిత నేతలే మాట్లాడకపోవటం బాధ కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం అండతోనే ఎస్సీలు.. శిరోముండనాలు, హత్యలు, చిత్రహింసలకు గురవుతున్నారని, దళిత మంత్రులు జగన్మోహన్ రెడ్డిని నిలదీస్తేనే ఎస్సీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మరోసారి జగన్మోహన్ రెడ్డిని నమ్మితే అంతా కలిసి గోదాట్లో దూకటమేనని అచ్చెన్నాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీకి ఒకప్పుడు మాల పల్లెల్లో కుర్చీలు వేసేవారు కాదని.. ఇప్పుడు కుర్చీలు వేసి కూర వండి, భోజనం పెట్టి మరీ బాధలు చెప్తున్నారన్నారు. విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తీసి జగన్ తన పేరు పెట్టుకున్నారని విమర్శించారు. అంబేద్కర్‌కు భారత రత్న ఇచ్చింది తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోనేనని, రాష్ట్రంలో కుల వివక్షను రూపుమాపటానికి చర్యలు తీసుకుంది చంద్రబాబేనని స్పష్టం చేశారు. దళితులకు జనాభా ప్రాతిపదికన అన్ని రకాల అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించిన నాయకుడు చంద్రబాబని, సామాజిక న్యాయానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# నేను సీఎం అయితే అన్నింటికీ పరిష్కారం కాదు..

ప.గో.జిల్లా: తూర్పు కాపుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి బీజం పడింది భీమవరంలోనేనని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం ఆయన భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ.. పోరాట యాత్ర 2014లో శ్రీకాకుళం నుంచే మొదలుపెట్టానని, ఉత్తరాంధ్ర నుంచే ఎక్కువ వలస కార్మికులు వస్తుంటారని, ఉత్తరాంధ్ర కార్మికులు సాహసికులని పేర్కొన్నారు. తూర్పు కాపుల సంఖ్యను టీడీపీ 26 లక్షలని, వైసీపీ ప్రభుత్వం 16 లక్షలని చెబుతోందని.. కానీ 45 లక్షల మంది తూర్పుకాపులున్నారని పవన్ అన్నారు. ఏ ప్రాతిపదికన వైసీపీ 16 లక్షలని చెబుతోంది?.. పథకాలు అందకుండా చేయడానికి వైసీపీ అలా అంటోందని ఆరోపించారు. జనసేన అధికారంలోకి వస్తే, తూర్పుకాపుల జనగణన చేపడతామని, చట్టంతో అందరికీ న్యాయం జరిగితే.. కులాలతో సంబంధం లేదని, చట్టం పనిచేయనప్పుడు కులాల వైపు చూస్తామన్నారు. తూర్పుకాపుల్లో బలమైన నాయకులు ఉన్నారని.. వారు ఎదుగుతున్నారు.. కులాన్ని పట్టించుకోవడం లేదన్నది మంత్రి బొత్స సత్యనారాయణ కూడా ఆలోచించాలని సూచించారు. తూర్పుకాపుల్లో మంత్రులు ఉన్నారు.. ఎమ్మెల్యేలు ఉన్నారు.. వారు తిన్నాకైనా వారి కులం గురించి ఆలోచించాలన్నారు. ఇతర బీసీ కులాలకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సర్టిఫికెట్లు ఇస్తున్నప్పుడు, తూర్పుకాపులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇవ్వకపోవడానికి హేతుబద్ధత ఏంటన్నారు.




తెలంగాణాలో 31 కులాలను బీసీ జాబితా నుంచి తూర్పు కాపులను తొలగించారని, అయినా అప్పటి నాయకులు పట్టించుకోలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఈ సమాజంలో ఖచ్చితంగా మార్పు రావాలి.. బీసీ కులాల జనగణనకు అనుకూలంగా ఉన్నానని పవన్ తెలిపారు. తాను సీఎం అయితే అన్నింటికి పరిష్కారం కాదన్నారు.

సీఎం అవ్వడం అన్నింటికీ మంత్రదండం కాదని.. తాను సీఎం అయిన తరువాత చేయాలనుకున్నా.. అధికారులో, నాయకులో అడ్డుపడతారన్నారు. చైతన్యవంతమైన సమాజంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, తాను సీఎం అయినా నన్ను నిలదీసే స్థితికి ప్రజలు రావాలన్నారు.

# పవన్ కల్యాణ్ అంటే నాకు సానుభూతి

నెల్లూరు: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలన అద్భుతమని రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడతూ... చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాకా ఎటువంటి అభివృద్ధి జరగలేదని.. అన్ని అబద్దాలు చెప్పి పాలన ముగించారని విమర్శించారు. గతంలో వైఎస్సార్ ఎంతో అద్భుతంగా పాలన చేశారని.. ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన మేనిఫెస్టోలలో చెప్పిన పథకాలన్నీ 99.5శాతం పూర్తి చేశారన్నారు. గత ప్రభుత్వాలు తమ పాలనలో 5 శాతం కూడా తమ మేనిఫెస్టో పూర్తి చేయలేదని అన్నారు. పోలవరం పనుల్లో చంద్రబాబు తీవ్ర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెన్నా ఆనకట్ట పూర్తి చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు టీడీపీ ఎక్కడా లెక్కలు చూపలేదని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక దోపిడీ చేసిందంటూ..అసత్య ప్రచారాలు చేస్తున్న టీడీపీ గతంలో లక్షలు కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఏపీ ఐటీ రంగం పరుగులు పెడుతోందని, విద్య వైద్య రంగంలో వైసీపీ ప్రభుత్వం ఎంతో అద్భుతంగా పనిచేస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు తన తనయుడిని కూడా సరైన మార్గంలో పెంచలేదని విమర్శించారు. రూ.60 కోట్లు ఇచ్చి సర్టిఫికెట్‌లు కొని ఇతర దేశాల్లో చదువుకొన్నాడని అందరికి తెలుసని అన్నారు. పుత్రుడు, దత్త పుత్రుడు ఇద్దరూ హాంతకుల్లా మాట్లాడుతూ ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చదవడం, రాయటం రాని లోకేష్ పాదయాత్ర చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యేలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పవన్ అమాయకుడని.. ఆయన అంటే తనకు సానుభూతి అని అన్నారు. పవన్‌ను చంద్రబాబు వాడుకుంటున్నారని వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ వారసులు రాజాకీయాల్లోకి వస్తే ఆదరించాలని లక్ష్మీపార్వతి కోరారు.

## చీరందంలో నీలాంబరి సొగబులు

వెటరన్ నటీమణుల్లో రమ్యకృష్ణ సమ్ థింగ్ స్పెషల్.రేర్ గా సోషల్ మీడియాలో రమ్యకృష్ణ ఫోజులు ఆమెని సీనియర్ భామల నుంచి వేరు చేస్తుంటాయి. నవతరం నాయికలకు ఏ మాత్రం తగ్గకుండా యువతని ఆకర్షిస్తుంటారు. తాజాగా రమ్యకృష్ణ సంప్రదాయ చీరందంలో తళుక్కున మెరిసారు. ఇదిగో ఇక్కడిలో షోల్డర్ లెస్ డిజైన్డ్ బ్లౌజ్ లో గ్రీన్ కలర్ సారీలో వావ్ అనిపిస్తున్నారు. ఆమె ఎంపిక చేసుకున్న మ్యాచింగ్ ఎక్సరసీస్..పెదాలపై సన్నని నవ్వు...కళ్లలో భావాలు..స్కిన్ టోన్ రమ్యకృష్ణని కొత్తగా ప్రజెంట్ చేస్తున్నా యి. 50 ఏళ్లు పై బడిన అదే అందంతో ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఆమె అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. సీనియర్ బ్యూటీ ఇలా చీరందంలో మెరవడం కొత్తేం కాదు. ఇన్ స్టా ద్వారా ఎప్పటికప్పుడు



సంప్రదాయ దుస్తుల్లో మెరుస్తుంటారు. ఆమె సెకెండ్ ఇన్నింగ్స్ లో దూసుకుపో తున్నారంటే? ఇలాంటి ఎలివేషన్లు కూడా కొంతవరకూ కలిసొస్తున్నాయనొచ్చు. ప్రతిభ ఒక్కటే సరిపోదు. అప్పుడప్పుడు ఇలా టచ్ లో ఉంటేనే? అవకాశాలు వస్తాయని తన సీక్రెట్ ని ఇలా రివీల్ చేస్తున్నారు. ఇటీవలే రంగమార్తాండ సినిమాలో ఓ కీలక పాత్రతో మెప్పించిన సంగతి తెలిసిందే. ఈ పాత్ర ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. అంతకు ముందు లైగర్ బంగార్రాజు రొమాంటిక్ చిత్రాల్లో మామ్ పాత్రలతో ఆకట్టుకున్నారు. 50 ఏ ళ్లు పైబడిన నటి ఇంకా తెలుగు సినిమాల్లో యాక్టివ్ గా ఉన్నారంటే? అదంగా ఆమె గొప్పతనమే. తనకోసం అంటూ దర్శకులు కొన్ని పాత్రలు సృష్టిస్తున్నారు. వాటిని తెలివిగా ప్రతిభతో సద్వినియోగం చేసుకుంటున్నారు. రమ్యకృష్ణ తరం హీరోయిన్లు చాలా మంది రిటైర్మెంట్ తర్వాత వేర్వేరు రంగాల్లో స్థిరపడ్డారు. కానీ నీలాంబరి మాత్రం నాగార్జున లాంటి హీరోకి అప్పుడప్పుడు భార్య పాత్రలు పోషిస్తున్నారంటే? అందంతా ట్యాలెంట్ తోనే సాధ్యమనాలి. అంతకు ముందు బాహుబలిలో శివగామి పాత్రతో పాన్ ఇండియనే షేక్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా నటిస్తోన్న గుంటూరు కారంలో నటిస్తున్నారు.

## ఫేమస్ అవ్వడం కోసం పెదవి ముద్దులివ్వలేదు! తమన్నా

'లస్ట్ స్టోరీస్ -2' కోసం మిల్కీ బ్యూటీ ఇంటిమేట్ సన్నివేశాల్లో చెలరేగిన సంగతి తెలిసిందే. విజయ్ వర్మతో అమ్మడు లిప్ లాక్ సన్నివేశాలు అంతటా కాకపుట్టిస్తున్నాయి. బాలీవుడ్ కన్నా తెలుగులో ఫేమస్ అయిన బ్యూటీ! ఏనాడు తెలుగు తెరపై ఇంతలా చెలరేగింది లేదు. 18 ఏళ్ల పాటు తమన్నా విధించుకున్న నో లిప్ కిస్ పాలసీని లస్ట్ స్టోరీస్ కోసం పక్కనబెట్టేసి చేసింది. ఈ నేపథ్యంలో తమన్నా కొన్ని విమర్శలు ఎదు ర్కొంది. ఇంత కాలం పెదవి మద్దులు ఇవ్వని తమన్నా ఇలా ఎందుకు బోర్డర్ దాటినట్లు? విజయ్ వర్మ పెళ్లి చేసుకుంటేందనే రీజన్ తోనే? ఇలా చేసిందా? అంటూ కొన్ని కామెంట్లు వైరల్ అయ్యాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అమ్మడు వాటన్నింటిపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది. సుజోయ్ ఘోష్



తో వర్క్ చేయాలని నేను ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. ఇలాంటి సబ్జెక్ట్ లో ఆయన దర్శకత్వంలో నటించడం ఆనందంగా ఉంది. ఒకప్పుడు పరిస్థితులు వేరు. ఇప్పుడు వేరు. కాలానికి అనుగుణంగా మారే వ్యక్తుల్లో నేను ఒకదాన్ని. ఒక నటిగా సృజనాత్మకత కోసం ఈ నిర్ణయం తీసుకున్నా. సినిమా పరిశ్రమకొచ్చి 18 ఏళ్లు అయిన తర్వాత ఫేమస్ అవ్వాల్సిన అవసరం లేదు. ఫేమస్ అవ్వడం కోసం లిప్ కిస్ సన్నివేశాల్లో నటించాల్సిన అవసరం లేదు' అని తెలిపింది. తమన్నా గ్లామర్ సన్నివేశాల్లో చాలా సినిమాల్లో నటించింది. వెండి తెరపై స్కిన్ షో తో మెప్పించిన సందర్భాలెన్నో ఉన్నాయి. అయితే ఆ ముద్దు కేవలం విజయ్ వర్మ ఉండటం వల్లే సాధ్యమైందా? విజయ్ వర్మ స్థానంలో మరో నటుడు ఉన్నా? తమన్నా అలాంటి సన్నివేశంలో నటించేదా? అన్న దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. ఇక తమన్నా తెలుగు సినిమా సంగతి చూస్తే ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తోన్న 'భోళా శంకర్' లో నటిస్తోంది. కొన్ని కొత్త ఛాన్సులు క్యూలో ఉన్నట్లు సమాచారం.




## 'హీరోయిన్లు' ఇద్దరు అవకాశ వాదులా?





విజయ్ ఫాన్స్ ఆ హీరోయిన్స్ అని ఆన్లైన్ వేదిక గా ట్రోల్ చేస్తున్నారు తలపతి విజయ్ కి హాట్ బ్యూటీలు రష్మిక మందన్నా..పూజాహెగ్డేలు విపరీతమైన అభిమానులు. సౌత్ లో తమ అభిమాన హీరోలు ఎవరంటే? విజయ్ పేరు చెబుతారు. రష్మిక అయితే ఏకంగా తన లవ్ అని కూడా అంది. ఇద్దరు విజయ్ తో సినిమాలు చేసారు. వారసుడు సినిమా చేస్తున్న సమయంలో రష్మిక విజయ్ ని ఎలా ఆకాశానికి ఎత్తేసేదో పాత పోస్ట్ లు చూస్తే తెలుస్తుంది. అలాగే బీస్ట్ సమయంలో పూజాహెగ్డే కూడా అంతకు మంచి విజయ్ ని ఉద్దేశించి పోస్ట్ లు పెట్టేది. ఆ సినిమా ప్రమోషన్ కోసం వ్యక్తిగతంతో చాలా హంగామా చేసింది. ఆ హీరో బర్త్ డే సందర్భంగా ఇద్దరు భామలు చేసిన హడావుడి గురించైతే చెప్పాల్సిన పనిలేదు. ఓ ఫ్యామిలీ మెంబర్ ని మించి ట్రీట్ చేసి శుభాకాంక్షల వెల్లువ కురిపించారు. అయితే తాజాగా జూన్ 22 విజయ్ తన 49వ పుట్టిన రోజును జరుపుకున్నాడు. ఈ సందర్భంగా ఇండస్ట్రీ నుంచి అభిమానుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఎప్పుడు సహజంగా జరుగుతుంది కాబట్టి దీన్ని పెద్దగా హైలైట్ చేయాల్సిన పనిలేదు. అయితే రష్మిక మందన్న..పూజాహెగ్డే మాత్రం ఈసారి తలపతికి కనీసం పుట్టిన రోజు శుభాకాంక్షలు కూడా చెప్పలేదు. విజయ్ తో సినిమా చేస్తున్న సమయంలో పుట్టిన రోజు విషెస్ తో పాటు ఆ సినిమా పోస్టర్లను భామలిద్దరు సోషల్ మీడియాలో వైరల్ చేయడంలో కీ రోల్ పోషించారు. కానీ ఇప్పుడు మాత్రం సైలెంట్ అయిపోయా రు. అయితే పూజాహెగ్డే మాత్రం బర్త్ డే అయిపోయిన రెండు రోజులకు ఏదో ఓ డాన్స్ వీడియో మెక్కు బడిగా షేర్ చేసింది. అందులోనూ ఎలాంటి బీ లేటెడ్ విషెస్ కూడా పోస్ట్ చేయలేదు. ఇక రష్మిక అయితే కనీసం పత్తా కూడా లేదు. దీంతో సోషల్ మీడియాలో విజయ్ అభిమానులు వాళ్లిద్దర్ని ట్రోల్ చేయడం పనిగా పెట్టుకున్నారు. సినిమా చేస్తున్నప్పుడే ఆ హీరోతో భజన చేస్తారా? హీరోలు అప్పుడే గుర్తొస్తారా? సినిమాలు చేయకపోతే గుర్తు రారా? అంటూ ఆడేసుకుంటున్నారు. వెబ్ మీడియాలో ఇలాంటి కామెంట్లు..ట్రోలింగ్ లు సహజమే అనుకోండి.

## రణవీర్ అలియా.. కిస్సు వరకు వచ్చేశారు..



బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ జంటగా నటించిన చిత్రం రాకీ ఔర్ రాణి. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్ ట్రైనర్ గా ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. కరణ్ జోహార్ ఈ సినిమా దర్శక నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫ్యామిలీ సినిమాలు చేయడంలో కరణ్ జోహార్ ది అందవేసిన చేయి. కాగా చాలా కాలం తర్వాత ఆయన నుంచి వస్తున్న సినిమా ఇది కావడం విశేషం. ఇటీవల ఈ మూవీ టీజర్ ని బాలీవుడ్ బాద్షా షారూఖ్ ఖాన్ విడుదల చేయడం విశేషం.టీజర్ చాలా కొత్తగా ఆకట్టుకునేలా ఉంది. ఈ టీజర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. టీజర్ విడుదలైన మొదటి గంట లోనే దాదాపు రెండు లక్షల 50 వేల వ్యూస్ వచ్చాయి. దీంతో ఈ మూవీపై ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఉన్నారో తెలుస్తోంది.ాగా ఈ మూవీ లో స్పెషల్ గా అలియా రణవీర్ కెమిస్ట్రీ టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. వీరిద్దరి కెమిస్ట్రీ మూవీ కి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం చెబుతోంది. కేవలం టీజర్ లోనే ఇంత బాగుంది అంటే మొత్తం మూవీ చూస్తే వీరి పెయిర్ కి అందరూ ఫిదా అయిపోవడం ఖాయమని మూవీ టీం ధీమా వ్యక్తం చేస్తోంది.

నిజంగా బయట కు మూవీ పోస్టర్లు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. తాజాగా ఓ ఫోటో వారి అభిమానుల ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అందులో అలియా నీలం రంగు చీర కట్టుకొని ఉండగారణవీర్ నీలం రంగు చొక్కా ధరించి ఉన్నారు. ఏదో పాట లోని క్లిప్ అని అర్థమౌతోంది. వారిద్దరూ సన్నిహితంగా ఉన్న ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఇదిలా ఉండగా పెళ్లి తర్వాత అలియా చేస్తున్న సినిమా ఇది కావడం విశేషం. పెళ్లైన వెంటనే ఆమె తల్లి కావడం ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. డెలివరీ సమయం లో కాస్త బొద్దుగా మారిన అలియా ఆ తర్వాత చాలా తక్కువ కాలంలో ఫిట్ గా మారడం విశేషం. ఇక ఈ మూవీ టీజర్ లో అలియా చాలా అందంగా కనిపించింది. టీజర్ మొత్తం రంగు రంగుల చీరల్లో కనిపించి ఆకట్టుకుంది. నిమిషం పాటు ఉన్న ట్రైలర్ లో ఆమె దాదాపు 20చీరల్లో కనిపించడం విశేషం. కాగా గతంలో రణవీర్ అలియా కాంబినేషన్ లో గల్లి బాయ్స్ సినిమా లో నటించారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయ్యింది. వీరి పెయిర్ కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యాయి. వీరిద్దరి కాంబినేషన్ లో వస్తున్న రెండో చిత్రం ఇది కావడం విశేషం. అలాగే దర్శకుడు కరణ్ జోహార్ కూడా దాదాపు 7 సంవత్సరాల తర్వాత ఈ మూవీ తో మెగా ఫోన్ పట్టడం గమనార్హం.

## గన్ షూటింగ్ కోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నా

నిఖిల్ సరసన స్పై చిత్రంలో నటించింది ఐశ్వర్య మీనన్. ప్రముఖ ఎడిటర్ గ్యారీ బిహెచ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాని చరణ్ తేజ్ ఉప్పలపాటి- రాజ శేఖర్ రెడ్డి భారీ స్థాయిలో నిర్మించారు. టీజర్ ట్రైలర్ ఆకట్టుకున్నాయి. జూన్ 29న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా తాజా ఇంటర్వ్యూలో ఐశ్వర్య మీనన్ తెలిపిన సంగతులివి. స్పై నా మొదటి తెలుగు సినిమా. నా తొలి పరిచయం ఒక కలలాంటిది. దర్శకుడు గ్యారీ బిహెచ్ ఈ సినిమా సైన్ చేయగానే నన్ను హీరోయిన్ గా అనుకున్నారు. ఈ కథ ఆయన చెప్పగానే విని థ్రిల్లయ్యాను. రెండో ఆలోచన లేకుండా సంతకం చేసాను. ఈ చిత్రంలో నా పాత్ర యాక్షన్ - స్టంట్స్ చేయాలి. రా ఏజెంట్ గా కనిపించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను. గన్ షూటింగ్ లో దాదాపు ఆరు నెలలు శిక్షణ తీసుకున్నాను. రా ఏజెంట్ గా కనిపించాలంటే దానికోసం చాలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలుసుకున్నా. ఆసక్తికర ప్రయాణమిది. ఎలాంటి గుర్తింపుని ఆశించకుండా దేశానికి సేవ చేసే 'రా' వింగ్ గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయాను. నేను స్టంట్స్ నేర్చుకున్నాను కాబట్టి యాక్షన్ సినిమాలపై ఇక నమ్మకం పెరిగింది. స్పై 2 తెరకెక్కేందుకు ఛాన్సుంది.



ఒకవేళ సీక్వెల్ తీస్తే నాకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. నిఖిల్ గురించి చెప్పాలంటే అతడు తెలివైన నటుడు. హ్యాపీ డేస్ నుంచి తన పనిని చూస్తున్నాను. ఆయన కథల ఎంపిక చాలా బాగుంటుంది. చాలా పాజిటివ్ పర్సన్ . చాలా ఎనర్జిటిక్. తనతో కలిసి నటించడం సౌకర్యంగా ఉంటుంది. సాంకేతిక నిపుణుల్లో శ్రీచరణ్ పాకాల గారు నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. ఆయన తూ ముజే ఖూన్ థో పాట చేశారు. అలాగే విశాల్ చంద్రశేఖర్ రెండు పాటలు చేశారు. స్పై సంగీతం అద్భుతంగా కుదిరింది. సవాళ్ల గురించి మాట్లాడాలంటే...? రా ఏజెంట్ గా కనిపించడం ఒక సవాల్ లాంటిది. ఇదివరకూ నేను ఇలాంటి యాక్షన్ సినిమాలు చేయలేదు. కదలికలు.. ఫైటింగ్స్... యాటిట్యూడ్ అన్నీ రా ఏజెంట్ లా సహజంగా ఉండేలా చూసుకోవడం ఛాలెంజింగ్. విజువల్స్ చూసుకున్నాక నాపై నాకు నమ్మకం పెరిగింది. ఇంజనీరింగ్ చేసి నటిని అయ్యాను. ఈ రంగంలో ఊహించుకోలేదు. నేను ఎప్పుడూ హీరోయిన్ అవుతానని అనుకోలేదు. ఆరంభంలో చిన్న చిన్న ప్రకటనలు చేశాను. ఒకొక్క అడుగువేసి ఇక్కడి వరకూ వచ్చాను. ఈ ప్రయాణం సంతోషాన్నిస్తోంది. భవిష్యత్ లో అన్నిరకాల పాత్రల్లో నటిస్తాను. అలియా భట్ చేసిన హైవే తరహా పాత్రలు పోషించాలని వుంది. నాకు అందరు హీరోలతో అవకాశాలు కావాలి. తదుపరి యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో కార్తికేయ హీరోగా ఒక సినిమా చేస్తున్నా. ఇతర భాషల్లోను అవకాశాలొస్తున్నాయి... అని చాటింగ్ ముగించారు.

## సూపర్ హాట్ పిక్స్ తో మతిపోగొడుతున్న రకుల్

కెరటం సినిమా తో తెలుగు సినిమా ఇండస్ట్రీ లో 2011 అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు లో ఈ అమ్మడి సినీ ప్రస్థానం వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమా తో టర్న్ తీసుకుంది. ఆ సినిమా విజయాన్ని సొంతం చేసుకోవడంతో వరుసగా సినిమాల్లో ఆఫర్లు రావడం జరిగింది. దాంతో రకుల్ స్టార్ హీరోయిన్ గా నిలిచింది. తెలుగు సినిమా ఇండస్ట్రీ లో దాదాపు నాలుగు అయిదు సంవత్సరాల పాటు చాలా బిజీ గా కెరీర్ ను కొనసాగించిన రకుల్ ప్రీత్ సింగ్ ఆఫర్లు తగ్గుతున్న సమయంలో మెల్లగా బాలీవుడ్ లో ప్రయత్నాలు మొదలు పెట్టింది. దాంతో అక్కడ వరుసగా పెద్ద సినిమాల్లో ఛాన్స్ లు దక్కాయి. కానీ అక్కడ ఇప్పటి వరకు కమర్షియల్



గా సక్సెస్ లను సొంతం చేసుకోలేక పోయింది. హీరోయిన్ గా రకుల్ ప్రీత్ సింగ్ ఎంత బిజీ గా ఉన్నా సోషల్ మీడియా లో అందాల ఆరబోత ఫోటోలు మరియు వీడియోలు రెగ్యులర్ గా షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ ఫోటోల ను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నడుము అందం చూపిస్తూ రకుల్ చేసిన ఈ షో అందరిని ఆకట్టుకుంటోంది.

రకుల్ ప్రీత్ సింగ్ యొక్క ఈ సూపర్ హిట్ పిక్స్ సూపర్ అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ యొక్క స్కిన్ షో ఫోటోలు ఎప్పుడు షేర్ చేసినా కూడా వైరల్ అవుతూనే ఉంటాయి. అయితే ఈసారి ఫుల్ డ్రెస్ లో కనిపించినా కూడా వావ్ అంటూ అంతా కూడా తెగ లైక్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సౌత్ లో సినిమాలు ఏమీ చేయని ఈ అమ్మడు హిందీ లో మాత్రం వరుసగా సినిమాల్లో నటిస్తోంది. ఓటీటీ సినిమాలు మరియు సిరీస్ లతో ఈ అమ్మడు మరింత బిజీ గా మారింది. ముందు ముందు మళ్లీ సౌత్ లో ముఖ్యంగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడు సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు.




భోపాల్: కేసీఆర్ కుమార్తె బాగుండాలంటే భారాసకు ఓటువేయాలని, ప్రజలు బాగుండాలంటే మాత్రం భాజపాకు ఓటు వేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన 'మేరా బూత్.. సబ్‌సే మజ్‌బూత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని.. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కుటుంబ పార్టీలపై మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం కేసీఆర్ కుటుంబంపై విమర్శలు గుప్పించారు. అదే విధంగా.. ఇటీవలి విపక్షాల భేటీపై ధ్వజమెత్తారు. 'అవినీతిపై చర్యలు తీసుకోవడంతోపాటు 2024 ఎన్నికల్లో భాజపా గెలవనున్న నేపథ్యంలోనే ప్రతిపక్షాలన్నీ ఒకచోట చేరాయి. ఆ పార్టీలన్నీ అవినీతి, కుంభకోణాలకు హామీ ఇస్తాయి. నేను మాత్రం అవినీతిపరులను వదిలిపెట్టేదే లేదన్న హామీ ఇస్తున్నా' అని వ్యాఖ్యానించారు. భాజపాకు కార్యకర్తలే అతిపెద్ద బలమని మోదీ పేర్కొన్నారు. తాము ఏసీ గదుల్లో కూర్చొని ఆదేశాలు జారీ చేయమని.. ప్రజలతో మమేకమయ్యేందుకు కఠిన వాతావరణ పరిస్థితులనూ ధైర్యంగా ఎదుర్కొంటామని తెలిపారు. పార్టీకి చెందిన ప్రతి కార్యకర్తకు దేశ ప్రయోజనాలే ప్రధానం. పార్టీకన్నా దేశమే పెద్దదని ప్రధాని మోదీ అన్నారు. బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయకూడదని భాజపా నిర్ణయించుకున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. 'ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తున్నవారు.. ముస్లిం బిడ్డలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. అయితే.. ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలకు భాజపా దూరం. ఉమ్మడి పౌరస్మృతి పేరిట కొన్ని పార్టీలు ప్రజలను రెచ్చగొడుతున్నాయి. అయితే.. వేర్వేరు చట్టాలతో దేశాన్ని ఎలా నడపాలి? ఒకే కుటుంబంలోని సభ్యులకు వేర్వేరు నిబంధనలు పని చేయవు. రాజ్యాంగం కూడా సమాన హక్కుల గురించి చెబుతోంది. అయితే.. ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఈ వ్యవహారంపై ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయి' అని విమర్శించారు




సోలాపూర్: తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమైనపుడు మహారాష్ట్రలో ఎందుకు కాదని భారాస అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. అన్ని వనరులూ ఉన్న మహారాష్ట్ర ఇంకెంతో అభివృద్ధి చెందాలన్నారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా సోలాపూర్ జిల్లా సర్కోలీలో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు. "దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిపోయాయి. అభివృద్ధి విషయంలో ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశాన్ని దాదాపు 50 ఏళ్లు కాంగ్రెస్ పాలించింది. మహారాష్ట్రలో ప్రజలు కాంగ్రెస్, శివసేన, భాజపాకు అవకాశం ఇచ్చారు. తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమైనపుడు మహారాష్ట్రలో ఎందుకు కాదు? రాష్ట్రం ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే తెలంగాణ అభివృద్ధి సాధించింది. మా విషయంలో అన్ని పార్టీలూ ఆందోళన చెందుతున్నాయి. భాజపాకు భారాస బీ టీమ్ అని విమర్శిస్తున్నారు. భారాస రైతుల పక్షాల మాత్రమే నిలుస్తుంది. అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో ముందుకెళ్తున్నాం. దేశం సరికొత్త పంథాలో నడవాల్సిన అవసరముంది " అని కేసీఆర్ అన్నారు.




హైదరాబాద్: భాజపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను చంపేందుకు కుట్ర జరుగుతోందని ఆయన సతీమణి జమున ఆరోపించారు. రూ.20కోట్లు ఇచ్చి ఈటలను చంపిస్తానంటూ భారాస ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అన్నట్లు తెలిసిందని ఆమె వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జమున మాట్లాడారు. "ఈటలను చంపేస్తామంటే మేం భయపడిపోం. కౌశిక్ రెడ్డి మాటల వెనక సీఎం కేసీఆర్ ఉన్నారు. ఓటుతో ప్రజలు కేసీఆర్‌కు బుద్ధి చెప్తారు. కౌశిక్ రెడ్డిని.. కేసీఆర్ హుజూరాబాద్ ప్రజలపైకి ఉసిగొల్పారు. ఆయన హుజూరాబాద్‌లో అరాచకాలు సృష్టిస్తున్నారు. అమరవీరుల స్తూపాన్ని కౌశిక్‌రెడ్డి కూలగొట్టించారు. మా కుటుంబంలో ఎవరికి హాని జరిగినా దానికి కేసీఆరే కారణం" అని జమున ఆరోపించారు. భాజపాలో ఈటల రాజేందర్ సంతృప్తిగా ఉన్నారని ఈటల జమున చెప్పారు. పార్టీ మారను అని ఆయన ఇప్పటికే స్పష్టంగా చెప్పారని తెలిపారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం లేదని చెప్పారు.

## తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ వస్తుంది.. అంతా కలిసికట్టుగా పనిచేస్తారు



న్యూఢిల్లీ: తెలంగాణలో నేతలందరూ కలిసికట్టుగా పని చేస్తారని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మానిక్ రావ్ థాక్రే తెలిపారు. మంగళవారం ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఖర్గే సమావేశం నిర్వహించారు. అనంతరం మానిక్‌రావ్ మీడియాతో మాట్లాడుతూ.. 100 శాతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు సిద్ధం కావాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలతో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగిందని.. రాష్ట్రంలో చేపట్టే కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలకు కోపంగా ఉన్నారన్నారు. పదేళ్ల తర్వాత కూడా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. తెలంగాణ ప్రజలను కేసీఆర్ కుటుంబం లూటీ చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేయాల్సిన అంశాలపై చర్చించామన్నారు. కాంగ్రెస్‌తో తెలంగాణ వికాస్ ఉంటుందని చెప్పారు. కేసీఆర్, బీఆర్ఎస్ అన్ని రాష్ట్రాలలో బీజేపీతో జత కడుతుందని తెలిపారు. మహారాష్ట్రలో కూడా కాంగ్రెస్ గట్టిగా ఉన్న చోట బీజేపీకి లాభం చేసేలా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మానిక్‌రావ్ థాక్రే విమర్శలు గుప్పించారు.

## హిమాచల్‌లో జలదిగ్బంధంలో 300 రోడ్లు.. నిలిచిన చార్‌ధామ్ యాత్ర



ఢిల్లీ: నైరుతి రుతుపవనాల రాకతో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. వర్షాలు, వరదల కారణంగా 300కు పైగా రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 'కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న 350 సున్నిత ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది'అని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా ఆరు మరణాలు సంభవించాయి.

**నిలిచిన చార్‌ధామ్ యాత్ర..** కేదార్‌నాథ్, బద్రీనాథ్ కు వెళ్లే మార్గంలో ప్రతికూల వాతావరణం కారణంగా చార్‌ధామ్ యాత్ర నిలిచిపోయింది. 'వేర్వేరు ప్రాంతాల్లో హిమపాతం, వర్షాలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దాంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ అనుమతించిన తర్వాత పర్యాటకులు తమ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరుతున్నాం' అని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మీడియాకు వెల్లడించారు. అలాగే ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి, చమోలీ, పితోరాగఢ్, రుద్రప్రయాగ, బాగేశ్వర్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.




**మహారాష్ట్ర పర్యటనలో భాగంగా సీఎం కేసీఆర్ మంగళవారం పండరీపురంలోని శ్రీ విఠల్ రుక్మిణి దేవస్థానాన్ని సందర్శించారు. విఠలేశ్వరుని సన్నిధిలో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు.**

## ఓటమి భయంతోనే మహారాష్ట్రకు కేసీఆర్..!



ముంబయి: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం మహారాష్ట్ర పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. మంగళవారం ఆయన పంఢర్‌పుర్‌లోని విఠల్ రుక్మిణి ఆలయాన్ని సందర్శించారు. అయితే, కొన్నాళ్లుగా మహారాష్ట్ర రాజకీయాలపై కేసీఆర్ దృష్టిసారించడాన్ని స్థానిక మహావికాస్ అఘాడీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ప్రస్తుత పర్యటనపై శివసేన (యూబీటీ) నేత, ఎంపీ సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర రాజకీయాలపై కేసీఆర్ ప్రభావం ఏ మాత్రం పడబోదని, ఇలాగే డ్రామాలాడితే తెలంగాణ (%వశ్రీఖఅస్త్రుఖ%)లోనూ ఓడిపోతారని వ్యాఖ్యానించారు. అక్కడ ఓటమి భయంతోనే మహారాష్ట్రకి వస్తున్నారని మీడియాతో మాట్లాడుతూ విమర్శలు గుప్పించారు. 'ఇప్పటికే భారాసకు చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇది కాంగ్రెస్, కేసీఆర్ మధ్య జరుగుతోన్న పోరు మాత్రమే. తెలంగాణలో జరుగుతోన్న రాజకీయ పరిణామాలపై మహారాష్ట్రలో ప్రతీకారం తీర్చుకుందామని భావిస్తే.. మీరు భాజపాకు పని చేస్తున్నట్లే అర్థం. కేసీఆర్.. భాజపా 'బీ టీం'. భాజపాయే ఆయన్ను మహారాష్ట్రకు పంపినట్లు అనిపిస్తోంది. అయితే, ఇక్కడ మహావికాస్ అఘాడీ బలంగా ఉంది. మహారాష్ట్రలో ఎంత బలం ప్రదర్శిస్తారో.. తెలంగాణలో అంత బలహీనపడతారు. అధికారం కోల్పోతారు' అని కేసీఆర్‌ను ఉద్దేశించి సంజయ్ రౌత్ మాట్లాడారు. 'కేసీఆర్‌కు పోరాట నేతగా గుర్తింపు ఉంది. కానీ, ఎందుకు భాజపాకు లొంగిపోతున్నారు? ఆలయాల సందర్శన వెనుక ఆంతర్యమేమిటి?' అని ప్రశ్నించారు. ఏదేమైనా.. ఈ వ్యవహారంపై చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. సీఎం కేసీఆర్ సోమవారం పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి 2 ప్రత్యేక బస్సులు, 600కు పైగా వాహనాలతో హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు పయనమైన విషయం తెలిసిందే. మహారాష్ట్రలోని సోలాపుర్‌లో సీఎంకు ఘన స్వాగతం లభించింది. నేడు పంఢర్‌పుర్‌లోని విఠల్ రుక్మిణి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ క్రమంలోనే సర్కోలి గ్రామంలో ఏర్పాటు చేసిన భారాస సభలో పాల్గొననున్నారు. ఆ తర్వాత తుల్జా భవాని అమ్మవారి దేవస్థానానికి చేరుకొని అక్కడ పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

## మాజీ రాజ్యసభ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి కన్నుమూత



హైదరాబాద్: మాజీ రాజ్యసభ సభ్యుడు సోలిపేట రామచంద్రారెడ్డి కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. గతంలో దొమ్మాట (ప్రస్తుత దుబ్బాక) ఎమ్మెల్యేగా సోలిపేట పని చేశారు. సర్పంచ్ నుంచి ఎంపీ వరకు రాజకీయాల్లో రాణించారు. అయితే కొంతకాలంగా ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. కాంగ్రెస్, టీడీపీ పార్టీలతో సోలిపేట పనిచేశారు. సోలిపేటకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సోలిపేట స్వస్థలం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామం. అయితే వారి కుటుంబం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనిలో నివాసం ఉంటోంది. అక్కడే ఆయన కన్నుమూశారు.

## తొలితరం ప్రజానేతను తెలంగాణ కోల్పోయింది: మాజీ ఎంపీ సోలిపేట మృతిపై కేసీఆర్ సంతాపం

హైదరాబాద్: మాజీ ఎంపీ సోలిపేట రామచంద్రారెడ్డి (92) కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇవాళ ఉదయం తుదిశ్వాస విడిచారు. రామచంద్రారెడ్డి మృతిపై సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఆయన జీవితం ఆదర్శం: సీఎం** – తొలితరం కమ్యూనిస్టు నేతగా, నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న సోలిపేట జీవితం ఆదర్శవంతమైందని కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన రాజకీయ జీవితంలో సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన క్రమం రేపటి తరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు.

సిద్దిపేట ప్రాంత వాసిగా, రాజకీయ సామాజిక రంగాల్లో ఆయన ఆచరించిన కార్యాచరణ.. ప్రజా జీవితంలో కొనసాగుతున్న ఎందరో నేతలకు ప్రేరణగా నిలిచిందన్నారు.

రామచంద్రారెడ్డి మరణంతో తెలంగాణ మరో తొలితరం ప్రజానేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆ మాట నేను చెప్పలేను.. చెప్పేవాడినీ కాను: కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో నేతలపై దుష్ప్రచారాలు చేసే దుస్థితి వచ్చిందని.. ఇలాంటి పరిస్థితులు తాను ఎప్పుడూ చూస్తాననుకోలేదని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. పార్టీలో తనపై నాలుగేళ్లుగా తప్పుడు ప్రచారం జరుగుతోందని జగ్గారెడ్డి ఆరోపించారు. పార్టీ కోసం ఎంత చేసినా తనను ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యూహాలపై చర్చించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలిచారని.. ఆయనకు అన్ని విషయాలూ వివరిస్తానని చెప్పారు. రాష్ట్రంలో పార్టీ ఐక్యంగా ఉందో? లేదో? చెప్పలేను.. చెప్పేవాడినీ కానని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్‌లోకి వెళ్లేవాళ్లంతా నెక్ట్స్ చేసే పని అదే!

నిజామాబాద్: కాంగ్రెస్‌లో చేరికలపై ఎంపీ అర్వింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరే వారంతా త్వరలో బీజేపీలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్‌లో భారీ చేరికలు అంటూ జరుగుతున్న ప్రచారం మీడియా సృష్టే. ముఖ్యమంత్రి కేసీఆర్ పని కట్టుకుని కాంగ్రెస్‌కు హైప్ చేయిస్తున్నారు. తొందరపడి ఎవరు కాంగ్రెస్‌లోకి వెళ్లొద్దు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీజేపీనే.. కాంగ్రెస్ ఎక్కడ ఉంది..? అమిత్ షా.. కేటీఆర్‌తో సమావేశం అయ్యారని రేవంత్‌కు ఎవరు చెప్పారు..?. బీఆర్ఎస్–బీజేపీ ఒక్కటేనని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎలా ఒక్కటైందో కాంగ్రెస్ సమాధానం చెప్పాలి.?. బీఆర్ఎస్‌కు దూరంగా ఉన్నామంటూ అసదుద్దీన్ చెప్పడం విడ్డూరం. కారు స్టీరింగ్ ఇప్పటికీ ఎంఐఎం చేతిలోనే ఉంది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉండదు. షరతులు పెట్టి కాంగ్రెస్‌లో జాయిన్ అవుతున్నారు. ఖమ్మంలో ఎలా గెలవాలో బీజేపీకి స్ట్రాటజీ మాకుంది. చట్టానికి ఎవరు అతీతులు కారు.. తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదు. కుటుంబ పార్టీలకు ఓటేస్తే వాళ్ల ఆస్తులు పెరుగుతాయి. పిల్లలకు మంచి భవిష్యత్ కావాలంటే బీజేపీకి ఓటు వేయాలి." అని అర్వింద్ విజ్ఞప్తి చేశారు.

## దీదీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్.. స్వల్ప గాయాలతో బయటపడ్డ సీఎం



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి పెను ప్రమాదం తప్పింది. సీఎం ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అయింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సిలిగురి సమీపంలోని సెవోక్ ఎయిర్ బేస్ వద్ద ఎమర్జెన్సీ ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటనలో సీఎం స్వల్ప గాయాలతో బయటపడినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జల్‌పాయ్‌గురి జిల్లాలో మంగళవారం జరిగిన బహిరంగ సభకు హాజరైన దీదీ.. అక్కడ ప్రసంగం అనంతరం హెలికాప్టర్ లో బాగ్ డోగ్రా బయలుదేరినట్లు టీఎంసీ నేతలు తెలిపారు. దీదీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ బైకుంఠపూర్ అటవీ ప్రాంతం మీదుగా వెళ్తుండగా.. వాతావరణ ప్రతికూలత ఎదురైనట్లు చెప్పారు. వర్షాలకు తోడు లో–విజిబిలిటీ కారణంగా సెవోక్ ఎయిర్ బేస్‌లో హెలికాప్టర్ ను అత్యవసరంగా ల్యాండ్ చేసినట్లు తెలిపారు. అనంతరం సీఎం రోడ్డు మార్గం గుండా బాగ్ డోగ్రా విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి కోల్ కతా బయలు దేరి వెళ్లినట్లు చెప్పారు. అయితే ఈ ఘటనలో దీదీ స్వల్పంగా గాయపడినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మమతకు శరీరం వెనుకభాగంలో, మోకాలికి స్వల్పంగా గాయాలైనట్లు వెల్లడించారు. దీంతో సీఎంను అంబులెన్స్ లో కోల్ కతాలోని ఎస్ఎస్ కేఎమ్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం మమతా బెనర్జీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com